WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంచార్జ్‌లు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు వర్తమాన వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989894528

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజా జ్యోతి

ప్రతిఅక్షరం - ప్రజల కోసం

వరంగల్

మంగళవారం 15 అక్టోబర్ 2024

పేజీలు :8

హన్మకొండ - భూపాలపల్లి - ములుగు - మహబూబాబాద్ - జనగాం

## రామప్ప చరిత్ర తెలిసేలా..

**నేటి నుంచి యునెస్కో వరల్డ్ హెరిటేజ్ క్యాంపెయిన్**

**12 రోజుల పాటు యువ వలంటీర్లకు శిక్షణ**

**22 మంది నిపుణులతో తరగతుల నిర్వహణ**






## కాంగ్రెస్‌వి డైవర్షన్ పాలిటిక్స్

**అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికి వదిలేసింది**

**420 మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చింది**

**పార్టీ అగ్ర నాయకులిచ్చిన హామీలు ప్రజలకు వివరిస్తాం**

**విలేకరుల సమావేంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

గీసుగొండ

అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికి వదిలేసిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. సోమవారం గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారం శివారులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 420 మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ మోసాలపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు నవంబర్ 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తున్నదన్నారు. తెలంగాణలో పార్టీ జెండా మారింది తప్ప పాలన మారలేదని అన్నారు. రైతుబంధు పేరు మార్చారే తప్ప ఆర్థిక సాయం అందించలేక రైతులను మోసం చేసిందని అవేదన వ్యక్తం చేశారు. - మిగతా3లో

## పోలీస్ పహారాలో ధర్మారం

**ఇరు వర్గాలపై కేసు నమోదు**

**డీసీపీ ఆధ్వర్యంలో బందోబస్తు పర్యవేక్షణ**

గీసుగొండ

దసరా పండుగ వేళ కొండా, రేవూరి వర్గీయుల గొడవతో ధర్మారం సహా గీసుగొండ మండలంలో ఒక్కసారిగా హైటెన్షన్ నెలకొనడంతో ఆ ప్రాంతం పోలీ సు పహారాలోకి వెళ్లింది. ఫ్లెక్సీలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఫొటో లేదని ఇరువర్గాలు బాహాబాహికి దిగి రచ్చరచ్చ చేయడంతో స్థానికంగా అలజడి రేగడంతో బందోబస్తు కట్టుదిట్టం చేశారు. తన వర్గీయులపై కేసులు నమోదు చేయడమే గాక పోలీసులు కొట్టారని ఆరోపిస్తూ ఆదివారం సాయంత్రం గీసుగొండ పోలీస్‌స్టేషన్‌కు మంత్రి సురేఖ వెళ్లి - మిగతా3లో



# కాంగ్రెస్‌వి డైవర్షన్ పాలిటిక్స్

-మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నట్లుగా రాష్ట్రంలోని రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ కాలేదన్నారు. పేదలకు ఇండ్లు కట్టిస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి చెప్పి మూసీ సుందరీకరణ పేరుతో వారి ఇండ్లను కూలగొడుతున్నాడన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా కాంగ్రెస్ రాష్ట్రంలో దుర్మార్గమైన పాలన సాగిస్తున్నదని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ , ప్రియాంక గాంధీ ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలన్నారు. అతి తక్కువ సమయంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఏ పథకంపై స్పష్టమైన అవగాహన లేదని విమర్శించారు. మూసీ సుందరీకణ పేరుతో రూ. లక్షా 50 వేల కోట్లు దోచుకోవడానికి కుట్ర చేస్తున్నదని మండిపడ్డారు. దేశంలో బీజేపీ మరింత బలపడుతున్నదని చెప్పటానికి అనేక రాష్ట్రాల్లో పార్టీ గెలుపే నిదర్శనమన్నారు. రాజీనామాలు చేయకుండా పార్టీ మారే ఎమ్మెల్యేలకు ప్రజలు బుద్ధి చెప్తారన్నారు. బీఆర్ఎస్ లో ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున ఎంపీగా పోటీచేసి ప్రజాతీర్పును అవహేళన చేశారన్నారు. వరంగల్ అభివృద్ధి కోసం స్మార్ట్‌సిటీ, అమృత్ పథకంలో పెద్ద ఎత్తున నిధులు ఇచ్చామన్నారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ కోసం ప్రభుత్వం భూమి సేకరించలేదన్నారు. మెగా టెక్స్ టైల్ పార్కుకు నిధులు కేటాయించింది కేంద్ర ప్రభుత్వమని, భూములు కోల్పోయిన రైతులకు పరిహారం ఇవ్వాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, కొండేటి శ్రీధర్, మాజీ ఎంపీ సీతారాం నాయక్, రాష్ట్ర నాయకులు రావు పద్మ, కాశీప్రసాద్‌రావు, విజయ్‌చందర్‌రెడ్డి, ఎడ్ల అశోక్‌రెడ్డి, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి జిల్లాలో పొలిటికల్ హీట్ పెంచిన అలయ్ బలయ్

**సంగారెడ్డి :** ఒకే రోజు ఆందోల్ నియోజకవర్గంలో కాంగ్రెస్, ఒబీఆ పార్టీల వేర్వేరు అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహించడంతో జిల్లాలో పొలిటికల్ హీట్ పెరిగింది. తాడ్ దాన్ పల్లి వద్ద మంత్రి దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలో అలయ్ బలయ్, సంగుపేట వద్ద మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ నిర్వహించే అలయ్ బలయ్ కార్యక్రమానికి మాజీ మంత్రి హరీష్ రావు హాజరయ్యారు. ఇరు పార్టీలు భారీ జనసమీకరణకి ప్లాన్ వేసాయి. ప్రతి ఏడాది వేర్వేరు తేదీల్లో అలయ్ బలయ్ నిర్వహించే నేతలు, ఈ సారి ది ఒకే రోజు నిర్వహిస్తుండటంతో ఆందోల్ రాజకీయాలు వేడెక్కాయి.

## కలెక్టరేట్‌లో జవాను ఆత్మహత్య

**మహబూబాబాద్ :** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కలక్టరేట్ లో స్ట్రాంగ్ రూం వద్ద ఓ కానిస్టేబుల్ గన్ తో కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణంలోని ఎన్ జీ ఓస్ కాలనీకి చెందిన జీ.శ్రీనివాస్ ఏఆర్ కానిస్టేబుల్ గా పనిచేస్తూ, కలెక్టర్ కార్యాలయంలోని ఉ20 స్ట్రాంగ్ రూం వద్ద విధులు నిర్వహిస్తున్నాడు. సాయంత్రం ఒక్క సారిగా ఫైర్ సౌండ్ రావడంతో అక్కడే వాచ్ మెన్ గా పనిచేస్తున్న ఇమామ్ పాషా వచ్చి చూసే వరకు కానిస్టేబుల్ శరీరంలోకి బుల్లెట్ దిగి కుప్పకూలి పోయాడు. విషయం తెలిసిన జేసీ డేవిడ్, ఎస్పీ సుధీర్ రాం నాథ్ కేకన్ పోలీస్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పూసైడ్ కు గల కారణాలు తెలువదని డీఎస్పీ తిరుపతి తెలిపారు... మృత దేహాన్ని పోస్టు మార్టం కోసం జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించారు.

## టోల్ ప్లాజాలలో బారులు తీరిన వాహనాలు

**నల్గొండ :** ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని హైదారాబాద్ – విజయవాడ హైవేపై వాహనాల రద్దీ కొనసాగుతుంది. దసరా పండుగ కోసం సొంత ఊర్లకు వెళ్లిన వారంతా.. తిరిగి హైదారాబాద్ కు ప్రయాణమవుతున్నారు. నిన్న మధ్యాహ్నం నుంచి హైదారాబాద్ వైపు వెళ్లే వాహనాల సంఖ్య అమాంతంగా పెరిగింది. ఉమ్మడి నల్లగొండ పరిధిలో..ఎన్హెచ్ 65 మీద ఉన్న ఉన్న కేతేపల్లి మండలంలోని "కొర్లపహాడ్" టోల్ ప్లాజా.. చౌటుప్పల్ మండలంలోని "పంతంగి" టోల్ ప్లాజా దగ్గర వాహనాల రద్దీ కొనసాగుతుంది. దీంతో.. రెండు టోల్ ప్లాజాల దగ్గర కిలో మీటరు మేర వాహనాలు బారులు తీరాయి. మరో వైపు.. హైదారాబాద్ – వరంగల్ హైవే పైనున్న బీబీనగర్ టోల్ ప్లాజా దగ్గర ట్రాఫిక్ బాగా పెరిగింది. నార్కట్ పల్లి– అద్దంకి హైవేపై ఉన్న మాడుగులపల్లి టోల్ గేట్ దగ్గర సైతం.. ట్రాఫిక్ పెరగడంతో.. వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి.

## మద్యం మత్తులో ఈత పందెం యువకుడిని కాపాడిన పోలీసులు

**రాజన్న సిరిసిల్ల :** ముస్తాబాద్ లో మద్యం మత్తులో ముగ్గురు యువకులు ఈత పందెం వేసుకున్నారు. పెద్దమ్మ గుడి చెరువులో అవతలి ఒడ్డుకు ఎవరు తొందరగా చేరుతారోనని ఛాలెంజ్ విసురుకున్నారు. ఇద్దరు యువకులు మధ్యలో అలిసిపోయి వెనక్కి వచ్చేసారు. మరో యువకుడు సుమంత్ నాయక్ మధ్యలో ఇరుక్కొని బండరాయిని పట్టుకుని వుండిపోయాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు చెరువులోకి దిగి సుమంత్ ను కాపాడారు.

## అడవులకు పొగమంచు శోభ

**ఆదిలాబాద్ :** శీతాకాలం ఆరంభానికి సూచికగా ఆదిలాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉదయం పూట పొగమంచు కమ్ముకొని కాశ్మీరాన్ని తలపిస్తోంది. ప్రకృతి అందాలకు ఆలవాలమైన జిల్లా వాతావరణంలో వచ్చే మార్పులతో మరింత సోయగాన్ని సంతరించుకుంటూ ప్రకృతి ప్రేమికులను పరవశింప జేస్తోంది. తలమడుగు మండలం బరంపూర్ కొండ పై వెలసిన వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సోమవారం? ఉదయం పొగమంచు కమ్మేయడం తో ఇలా ప్రకృతి రమణీయత ఉట్టిపడింది. చుట్టూ కొండలు.. పచ్చని పంటపొలాలు వాటి పై నుంచి పొగమంచు తెరలు తెరలుగా కమ్ముకోవడంతో ఆహ్లాదం నెలకొంది. ఉదయం ఆలయాన్ని దర్శించుకున్న భక్తులను తన్మయులను చేసింది.

## బౌరంపేటలో తండ్రి కొడుకులపై వీధి కుక్కల దాడి

**మేడ్చల్ :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బౌరంపేట్ లో ఆదివారం రాత్రి పని మీద బయటకు వెళ్లిన కుమ్మరి మల్లయ్య కుమారుడిని తీసుకొని ఇంటికి వస్తుండగా వీధి కుక్కలు చేశాయి. నెల రోజుల క్రితం ఇదే గ్రామంలో బాలుడి పై కుక్కల దాడి మరవకముందే మరో సారి వీధి కుక్కల స్వైర విహారం చేయటం పై స్థానికులు మండిపడుతున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే వీధి కుక్కల బెడద లేకుండా చేయాలని కోరుతున్నారు.

## సికింద్రాబాద్ టెంపుల్ ఘటన నేపథ్యంలో రాజా సింగ్ హౌజ్ అరెస్ట్..

**హైదరాబాద్ :** సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయ ఘటన నేపథ్యంలో బీజేపీ ఎమ్మెల్యే రాజా సింగ్ ను పోలీసులు హౌజ్ అరెస్టు చేసారు. దాంతో అయన స్పందించారు. అందరి లీడర్లను సంఘటన స్థలానికి వెల్లనిస్తున్ననారు. నన్నెందుకు హౌజ్ అరెస్ట్ చేస్తున్నారు..నేను మా కార్యకర్తలకు అండగా నిలబడాలనుకుంటున్నాను. ఈరోజు, రేపు హౌజ్ అరెస్ట్.. చేస్తారు ఇలా ఎన్ని రోజులు హౌజ్ అరెస్ట్ చేసి ఉంచుతారు. ఆ తర్వాత నైనా నేను సంఘటన స్థలానికి వెళ్తాను మా కార్యకర్తలకు అండగా నిలబడతాను.

## రామప్ప చరిత్ర తెలిసేలా..

వెంకటాపూర్

ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేటలోని రామప్ప దేవాలయంలో వరల్డ్ హెరిటేజ్ వలంటీర్ క్యాంపెయిన్‌ను మంగళవారం నుంచి నిర్వహిస్తున్నారు. యునెస్కో ఇండియా ఐకోమస్, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్, భారత పురావస్తు శాఖ, తెలంగాణ పర్యాటక శాఖ, ఇంటాక్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. చారిత్రక, పర్యాటక, వారసత్వ కట్టడాలున్న ప్రదేశాలపై 12 రోజుల పాటు (26వ తేదీ వరకు) అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమాన్ని యునెస్కో 2008లో ప్రారంభించింది. దీని ద్వారా ప్రపంచ వారసత్వ కట్టడాలపై యువతీ యువకులకు అవగాహన కల్పించనున్నారు. కొత్తగా గుర్తింపు పొందిన కట్టడాలపై ఐదేళ్ల పాటు వలంటీర్స్‌కు శిక్షణ ఇచ్చి వారి చేత ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో రామప్ప కట్టడం, దాని నిర్మాణశైలి, నిర్మాణానికి వాడిన వస్తువులు, అప్పటి ఇంజినీరింగ్ టెక్నాలజీ, సంస్కృతి, కళలు, చరిత్రపై అవగాహన కల్పించనున్నారు. దేశ, విదేశాల్లో చరిత్ర, కళలు, పురావస్తు, ఆర్కిటెక్చర్, సివిల్ ఇంజినీరింగ్ రంగాల్లో అవగాహన ఉన్న 18 నుంచి 35 ఏళ్ల యువతీ యువకులు 243 మంది నుంచి దరఖాస్తులు స్వీకరించి అందులో 40 మందిని ఎంపిక చేశారు. అలాగే వారితో పాటు యువ టూరిజం క్లబ్ నుంచి మరో 40 మందిని సెలెక్ట్ చేసి మొత్తం 80 మందికి శిక్షణ ఇవ్వనున్నారు. రామప్ప ఆలయ ప్రాంగణంలో ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర, ఎస్పీ డాక్టర్ శబరీశ్ క్యాంపెయిన్‌ను ప్రారంభించనున్నారు. కాగా, 22 మంది నిపుణులతో శిక్షణ కార్యక్రమాలను పాలంపేటలోని రైతు వేదికలో నిర్వహించనున్నారు.

## పోలీస్ పహారాలో ధర్మారం

-మొదటిపేజీ తరువాయి

పోలీసులతో వాగ్వాదానికి దిగడం, తన వర్గీయులతో పాటు రేవూరి వర్గీయులపై కేసు నమోదు చేయాలని పట్టుబట్టడంతో సీపీ చర్య లు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో మంత్రి అక్కడినుంచి వెళ్లిపోయిన విషయం తెలిసిందే. ఈమేరకు ఆదివారం రాత్రి నుంచే ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్ ఆధ్వర్యంలో ధర్మారంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామంలో పోలీసులు పికెటింగ్ పాయింట్ పెట్టి గస్తీ కాస్తున్నారు. కొత్త వారిని రానివ్వకుండా బయటకు పంపుతున్నారు. డీసీసీ, ఏసీపీ తిరుపతి పో లీస్‌స్టేషన్‌లో ఉంటూ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ ఎలాంటి గొడవలు, అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూస్తున్నారు. ప్రజలు రోడ్ల మీద గుంపులు గుంపులుగా ఉండకూడదని పోలీసులు సూచిస్తున్నారు.

**ఇరువర్గాలపై కేసు నమోదు**

ం సంబంధించి ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు సీఐ మహేందర్ తెలిపారు. కొండా వర్గానికి చెందిన బండి రాజ్‌కుమార్, ముస్కు సురేశ్, కూస రాజ్‌కుమార్, శివప్రసాద్, ముస్కు రాజ్‌కుమార్, రాజు, మహేశ్వర్, వంశీలపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. విచారణ అనంతరం సోమవారం రేవూరి వర్గానికి చెందిన పిట్టల అనిల్‌పై కేసు నమోదు చేశామని తెలిపారు.

**ధర్మారం వెళ్లొద్దు.. సీపీ సూచన**

ఇరువర్గాల దాడిలో గాయపడ్డ పిట్టల అనిల్‌ను పరామర్శించేందుకు జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి వెళ్తున్న విషయం తెలుసుకున్న పోలీసు లు సీపీ అంబర్ కిశోర్‌ఝాకు సమాచారం చేరవేశారు. సీపీ వా రితో ఫోన్‌లో మాట్లాడి ఇప్పుడే గ్రామానికి వెళ్లొద్దని మళ్లీ గొడవలు జరిగే ఆస్కారం ఉందని విజ్ఞప్తి చేయడంతో వారు పరామర్శకు రాలేదని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు.

## కోర్టు స్టే తెచ్చుకున్న ఆర్బీఎక్స్ ఇంటి యజమానులు

**హైదరాబాద్:** హైదరాబాద్ లో మా ఇళ్ళు కూల్చివేయవద్దు ఆర్బీఎక్స్ రాసిన ఇండ్ల యాజమానులు అంటూ కోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో చైతన్యపురి, ఫణిగిరి కాలనీ, సత్యానగర్, కొత్తపేట లో మూసి పరివాహక ప్రాంతల్లో ఏ ఇంటి వద్ద చూసిన కోర్ట్ స్టే లే కనిపిస్తున్నాయి

# పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తి పై కేసు నమోదు




దేవరుప్పుల అక్టోబర్ 14, (ప్రజాజ్యోతి):-

పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఓ వ్యక్తిపై కేసు నమోదు అయిన ఘటన దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై సృజన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గత శనివారం గ్రామానికి చెందిన ఓ మహిళ గొడవ జరుగుతుందని 100 నంబర్ కు కాల్ చేసింది. కానిస్టేబుల్ మసూద్ ఘటన స్థలానికి వెళ్లి పరిశీలిస్తుండగా గ్రామానికి చెందిన నగేష్ అనే వ్యక్తి దురుసుగా ప్రవర్తిస్తూ దుర్భాషలాడడంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# ఘనంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుని జన్మదిన వేడుకలు



కొత్తగూడ అక్టోబర్ 14(ప్రజాజ్యోతి)

కొత్తగూడ మండల కేంద్రం లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వజ్జ సారయ్య జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు ఈ కార్యక్రమం లో నర్సంపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొల్లు రవి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు తధానంతరం మండల అధ్యక్షులు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బానోత్ రూప్సింగ్,బోయినేని ప్రశాంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు, కొత్తగూడ టౌన్ ఉపాధ్యక్షులు వెలుదండి వేణు, బిక్షపతి వెంకన్న తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

# స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్ లను తక్షణమే విడుదల చేయాలి

## – యూఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి వీరబాబు

మరిపెడ,అక్టోబర్14 (ప్రజా జ్యోతి) :

పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్,ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని కోరుతూ డిగ్రీ,పీజీ కళాశాలలా యజమాన్యాలు నిర్వహిస్తున్న బంద్ కు భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ మహబూబాబాద్ జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి వీరబాబు పెద్ద బోయిన పత్రికా ప్రకటన ద్వారా వారుతెలిపారు.అనంతరం వారు మాట్లాడుతూ మా ప్రభుత్వం స్కాలర్షిప్ ప్రీయంబర్స్మెంట్ వచ్చిన పథకమని గొప్పలు మాట్లాడే కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు విడుదల చేయట్లేదని ప్రశ్నించారు.అనేక కళాశాలలు స్కాలర్షిప్, రియంబర్స్మెంట్ ఆధారపడి డిగ్రీ కళాశాల నడుపుతున్నాయని అనేకమంది ఉపాధి కూడా కోల్పోయే ప్రమాదం ఉందని మండిపడ్డారు. అలాగే డిగ్రీ కళాశాలలో సేవా దృక్పథంతో అనేకం ఉన్నాయని కార్పొరేట్ విద్యాసంస్థల లాగా ఫీజులు వసూలు చేయడం లేదని వారు సామాజిక స్పృహతో పని చేస్తున్నారని కక్షపూరితంగా వ్యవహరిచడం సరైంది కాదని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంగా వహిస్తే అనేకమంది ఉపాధి పై కూడా ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.అలాగే అనేక మంది విద్యార్థులు స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ పై ఆధారపడి చదువుకుంటున్నారని కానీ గత ప్రభుత్వం లాగే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ రియంబర్స్మెంట్ చెల్లించకుండా కాలయాపన చేయడం సిగ్గుచేటు అన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల కొన్ని యజమాన్యాలు




ఆత్మహత్యలు సైతం చేసుకున్నాయని తెలిపారు విద్యార్థులు పై చదువుల కోసం అప్పులు చేసి సర్టిఫికెట్లు తీసుకునే దుస్థితి ఏర్పడిందని వారు మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలను అనేక పథకాల కోసం ఖర్చు చేస్తున్న విద్యార్థులకు మాత్రం స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ ఎందుకు విడుదల చేయట్లే అని ప్రశ్నించారు. దాదాపు 8,000 కోట్లపైగా ఉన్న స్కాలర్షిప్ రియంబర్స్ ను తక్షణ విడుదల చేయాలని డిమాండ్ చేశారు అలాగే యజమాన్యాలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్చలకు పిలిచి విద్యార్థులు చదివి నష్టపోకుండా తరగతులు నిర్వహించే విధంగా కృషి చేయాలని అన్నారు.గత ప్రభుత్వ లాగే ఈ ప్రభుత్వం కూడా నిర్లక్ష్యం వహిస్తే విద్యార్థుల ఆగ్రహానికి గురికాక తప్పదని వీరబాబు హెచ్చరించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వహిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు మండల అధ్యక్షులు సుజిత్, సురేష్,ప్రణయ్,స్వప్న, లహరి,ప్రియాంక,ఉమా సంధ్య,కరిష్మా తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల కమిటీలు గ్రామ సభ ద్వార ఎంపిక చేయాలి

కొత్తగూడ అక్టోబర్14 (ప్రజాజ్యోతి) :

సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య ప్రభుత్వ పథకమైన ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని తమపార్టీ సొంత పథకం లాగా భావిస్తూ ఇందిరమ్మ ఇండ్ల కమిటీలను గుట్టుగా తమపార్టీ కార్యకర్తలతో నింపుకోవటం కాంగ్రెసు పార్టీ బరితెగింపు చర్యలకు నిదర్శనమని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య విమర్శించారు. ఈరోజు పాకాల కొత్తగూడ పాలడుగు క్రిష్ణ భవన్ లో పార్టీ కార్యకర్తలతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు కోసం పంచాయతీ స్థాయి కమిటీలు వేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని,గ్రామసభలు జరిపి ఈకమిటీల ఎంపిక చేయాల్సి వుండగా ఎలాంటి నిబంధనలను పాటించకుండా కాంగ్రెస్ పార్టీ స్వంత కమిటీలలాగా వేసుకోవటం విడ్డూరంగా వుందని ఆయన అన్నారు. బీఆరెస్ నియంతృత్వ పాలనకు చరమగీతం పాడి తాము ప్రజాపాలన సాగిస్తున్నామని గొప్పలు చెప్పుకొంటున్న కాంగ్రెస్ పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నదని అన్నారు. కమిటీల ఎంపిక చేయాల్సిన పంచాయతీ కార్యదర్శి మొదలు కలెక్టర్ వరకు అందరినీ పక్కన పెట్టి ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు ఏకపక్షంగా కమిటీలను వేసుకోవటం, దానికి అధికారులతో ఆమోద ముద్ర వేయించుకోవటం రాజ్యాంగాన్ని అపహాస్యం చేయటమే నన్నారు.పంచాయతీ ఎన్నికలు జరపకుండా స్పెషల్ ఆఫీసర్లను నియమించి స్థానిక సంస్థలపై ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు పెత్తనం చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగం ద్వారా



స్థానిక సంస్థలకు లభించిన అధికారాలను,హక్కులను హరించి ఏకపక్షంగా వ్యవహరించటం దేనికి నిదర్శనమో కాంగ్రెస్ పార్టీ సమాదానం చెప్పాలని అన్నారు. ఇందిరమ్మ కమిటీలను స్వంత పార్టీ కార్యకర్తలతో వేసుకొంటున్న కాంగ్రెస్ పార్టీ వారు భవిష్యత్తులో ప్రభుత్వం నుండి వచ్చే ఇందిరమ్మ ఇండ్లను పారదర్శకంగా కేటాయిస్తారంటే ఎవరూ నమ్మరని ఆయన అన్నారు. చట్ట విరుద్ధంగా,ఏకపక్షంగా వేసుకొన్న ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలని,షెడ్యూల్ విడుదల చేసి గ్రామ సభల ద్వారా కమిటీలను ఎంపిక చేయాలని ఐలయ్య డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా, సబ్ డివిజన్ నాయకులు బూర్క వెంకటయ్య, ఆగబోయిన నర్సక్క, ఇడంపాక శ్రీశైలం, గజ్జి లింగన్న, యాదగిరి యుగేందర్,బొమ్మగాని వెంకన్న,గట్టి సురేందర్, బూర్క బుచ్చి రాములు, రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

# భువనగిరి ఎంపీ కి వినతి పత్రం అందచేసిన బ్రిడ్జి సాధన సమితి సభ్యులు

జనగామ జిల్లా అక్టోబర్ 14(ప్రజాజ్యోతి ):

చిటకోడూరు వాగు మీద ఉన్న కల్వర్టు గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు ఒక్క పక్క కూలిపోవడం జరిగినది అని దీని వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురుకుంటున్నాము అని పది గ్రామాల ప్రజల కు ఇదే ఏకైక దారి అని ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలి అని చిటకోడూరు బ్రిడ్జి సాధన సమితి కన్వీనర్ యాసారపు కరుణాకర్ అన్నారు.ఈ రోజు చిటకోడూరు బ్రిడ్జి సాధన సమితి ఆధ్వర్యంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కి వినతి పత్రం అందచేయడం జరిగినది అని తెలిపారు.ఈ కార్యక్రమం లో దూడల సిద్దయ్య గౌడ్, మెరుగు బాలరాజు గౌడ్,సలేంద్రి శ్రీనివాస్,చిక్కుడు వెంకటేష్, చామకూర చిరంజీవి,వై కృష్ణం రాజు,వై పరశురామ్,కర్ల శ్రీకాంత్ రెడ్డి,రాజు యాదవ్,చెరుకూరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# పార్టీలో కష్ట పడ్డ వారికే సముచిత న్యాయం



-పార్టీ పటిష్ఠత, బలోపేతానికే ప్రాముఖ్యత, వ్యక్తిగత లాభాపేక్షకు తావు లేదు.
-అవకాశం వచ్చినప్పుడు అందిపుచ్చుకొని అభివృద్ధికై సత్తా చాటాలి.
-అవకాశం రాని వారు నిరుత్సాహపడవద్దు.
-నియోజకవర్గ అభివృద్ధికై పార్టీ మారక తప్పలేదు.
-రెండు సంవత్సరాల్లో అభివృద్ధిలో కడియం మార్క్ చూపిస్తా.

**స్టేషన్ ఘనపూర్ ప్రతినిధి, అక్టోబర్ 14 ( ప్రజాజ్యోతి ) :**
మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో సోమవారం అట్టహాసంగా మార్కెట్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం నిర్వహించారు.కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఉప ముఖమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరయ్యారు. స్టేషన్ ఘనపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారం కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జూలుకుంట్ల లావణ్య రెడ్డి, వైస్ చైర్మన్ నూకల ఐలయ్య తో పాటు డైరెక్టర్లను కడియం శ్రీహరి శాలువాలాతో, పూలమాలతో ఘనంగా సన్మానించి వారిని అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం పని చేస్తుందన్నారు. నూతనంగా ఏర్పడిన మార్కెట్ కమిటీ పాలకవర్గం రైతుల అభివృద్ధికి కృషి చేయాలని, రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడే వారికి రానున్న రోజుల్లో మంచి భవిష్యత్తు ఉంటుందని స్పష్టం చేశారు. మరో 2 రోజుల్లో ఇందిరమ్మ కమిటీలు వేసుకోబోతున్నామని పేర్కొన్నారు. ఈ కమిటీల్లో కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసే పాతవారికి, కొత్తవారికి సమన్యాయం చేసే విధంగా ఇందిరమ్మ కమిటీలు ఉండబోతున్నాయని తెలియజేశారు. రానున్న రోజుల్లో పదవుల్లో,



అభివృద్ధి పనుల్లో, ప్రభుత్వ పథకాల్లో మొదటి నుండి కాంగ్రెస్ జెండాను మోసిన వారికే న్యాయం జరుగుతుందని, ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. అభివృద్ధి పథకాల్లో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు ఇస్తున్నారని తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం గడిచిన 15 ఏళ్లలో అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం తాను పార్టీ మారనన్నారు. నిలిచిపోయిన ఎన్నో అభివృద్ధి పనులు ముందుకు తీసుకెళ్లేందుకు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీలో పని చేస్తున్నానని అన్నారు. కేంద్ర రాష్ట్ర కమిటీలు కడియం శ్రీహరి పార్టీలోకి రావాలని నన్ను ఆహ్వానించడం జరిగిందని ఏఐసీసీ, పీసీసీ ఆహ్వానం మేరకు పార్టీలోకి వచ్చానని తెలియజేశారు. పైరవీలు, లాబీలు చేసే వారికి నా దగ్గర అవకాశాలు రావని, ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్న వారికి అవకాశాలు ఉంటాయని ఎమ్మెల్యే కడియం స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి స్పష్టమైన ఎజెండాతో ముందుకు వెళుతున్నానని, ప్రతి గ్రామంలో కడియం శ్రీహరి మార్క్ కనిపిస్తుందన్నారు. త్వరలో నియోజకవర్గ అభివృద్ధి పనులకు సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వులు వస్తాయని, టెండర్లు పిలిచి అగ్రిమెంట్లు చేసుకొని పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. గ్రూపు రాజకీయాలకు తావు లేకుండా నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఒక్కరి సహకారం అందించాలని పిలుపునిచ్చారు. రైతులు, వ్యాపారులు మార్కెట్ లో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులను వ్యాపారులను ఇబ్బంది పెడితే తన దృష్టికి తీసుకురావాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైస్ మిల్లర్లు రైతుల దగ్గర ముక్కు పిండి వసూల్ చేశారన్నారు. మిల్లర్ల దగ్గర కమీషన్లు వసూలు చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని చెప్పారు. రైతు రుణమాఫీ చేసి నిజమైన ప్రజా పాలన చూపించింది కాంగ్రెస్ సర్కార్ అని అన్నారు. ప్రజలకు నీతివంతమైన, నిజాయితీతో కూడిన సేవలు అందించడమే నా ధ్యేయమని ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, చింతకుంట్ల నరేందర్ రెడ్డి, బెలిదే వెంకన్న, బూర్ల శంకర్, తోట వెంకన్న, దైద ఎలిషన్, గుజ్జరి రాజు, ఆన్నం బ్రహ్మారెడ్డి, కొలిపాక సతీష్, పోశాల కృష్ణ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 2003 - 2004 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**నర్సంపేట:ప్రజాజ్యోతి :**
నేతాజీ గురుకుల విద్యాలయం ఖానాపురం లో చదువుకున్న ఎస్.ఎస్.సి 2003 – 2004 బ్యాచ్ 20 సంవత్సరాల అపూర్వ కలయిక , పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం, ఘనంగా జరుపుకోవడం జరిగింది. గత 20 సంవత్సరాల చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ , గురువులు మాకు అందించిన విద్యాబుద్ధుల గురించి , మిత్రులందరు చర్చించుకుంటూ ఆనందంగా గడపడం జరిగింది. ఎవరికి ఏ కష్టం వచ్చినా మేమున్నామని మనోధైర్యాన్ని కల్పిస్తున్న మిత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు. అనంతరం మాకు విద్యను అందించిన ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించుకోవడం జరిగింది. ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్య ద్వారానే ఏదైనా సాధించవచ్చు. విద్య అని ధనాన్ని ఎవరు దొంగిలించలేరు. మనిషి జీవనశైలి,సమాజంలో ఆరోగ్యం , ఎక్కువగా మొబైల్ ఫోన్ వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి,వివిధ అంశాలపై చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన నేతాజీ గురుకుల విద్యాలయం స్థాపకులు సుబ్బారావు , ప్రస్తుతం ప్రధానోపాధ్యాయులు నాయుడు ,



ఉపాధ్యాయులు మోషయ్య , రాములు,2003 – 2004 ఎస్.ఎస్.సి బ్యాచ్ మిత్రులు రామకృష్ణ,శివ నరేష్, మనోహర్, బాలరాజు, దేవేందర్, సుధీర్, పరమేశ్వర్, రమేష్ సదానందం నగేష్, సంపత్, రాజు, ఐలేష్ మోహనకృష్ణ, శివరాం, శివకుమార్, శ్రీనివాస్, భరత్, సురేష్, అశోక్, రవి, ఎజాస్, మదర్, భాస్కర్, రాజ్ కుమార్, ఎల్లస్వామి, హిమబిందు, పద్మావతి, అరుణ, శ్రీలత, స్వాతి, సంధ్య, సృజన, స్రవంతి, మల్లికాంబ, సుమలత, నిరోష, అనిత, మంగమ్మ, సరోజన, రాధిక, హేమ, రాజమణి, రాణి,స్వప్న, ముంతాజ్, అభేద, సరిత పాల్గొనడం జరిగింది.

## ఇందిరమ్మ ఇండ్ల దామెర కమిటీ ఎన్నిక ..



**దామెర, అక్టోబర్ 14, (ప్రజా జ్యోతి):**
దామెర ఇందిరమ్మ ఇండ్ల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం దామెర మండల అధ్యక్షుడు దురిశెట్టి బిక్షపతి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తల సమక్షంలో ఐదుగురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పోతుల విజయ, మేరుగు జయ, కడం నగేష్, దామెర కట్టయ్య, అమ్ముల రవి కుమార్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ.. అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి నిరుపేదలను ఇండ్లు అందే విధంగా కమిటీ సభ్యులు పని చేస్తారని తెలిపారు. గుడిపాటి శ్రీధర్ రెడ్డి, సదిరం పోచయ్య, బిళ్ల రమణా రెడ్డి, కొమ్మాలు, ప్రవీణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలను పరమర్శించిన ఎమ్మెల్యే గండ్ర



**టేకుమట్ల అక్టోబర్14 ప్రజాజ్యోతి న్యూస్ :**
మండలంలోని వెల్లంపల్లి గ్రామానికి చెందిన సొల్లేటి రాములు, గీసహరీష్ లు ఆదివారం చలివాగులో మునిగి పోయిమృతి చెందగా, సోమవారం భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మృతదేహాలకు నివాళులర్పించి మృతుల కుటుంబాలను పరామర్శించారు. అనంతరం బండపల్లిలోరాగిడి మల్లారెడ్డి,పెద్దంపల్లిలోశాస్త్రాలకొమరయ్య,రాజమ్మ,రామకృష్ణాపూర్(టీ) లోజంగా సుందరమ్మలుమృతి చెందగా, మృతుల కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాహయంఅంద చేసారు. ఆయనవెంట కాంగ్రెస్ పార్టీమండల అధ్యక్షుడు కోటగిరి సతీష్ గౌడ్,మాజీ జెడ్పిటిసిపులి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శివైనాల రవీందర్, కృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు మాదం కొమరయ్య. ప్రధాన కార్యదర్శి ఎడ్లరమేష్, అంబరగొండ బుచ్చయ్య. కోశాధికారిశాస్త్రాల కిరణ్. బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులునాంపల్లి వీరేశం. బోల్లికొండచిన్న రాజయ్య. మండల నాయకులు. బండ రాగోతంరెడ్డి. సట్ల కొమురయ్య. గొల్లపల్లి వెంకటేశ్వర్లు. వంగ కుమారస్వామి. తోట గట్టయ్య. సంగీ రవి, కోయల చిరంజీవి. ఎలబోయిన రాజేందర్. పంజాల రవి. ఆరెపల్లి తిరుపతి. కోరే చందు. పోల్సాని దేవేందర్ రావ్. స్వామి రావు. బోల్లుసరోతం రెడ్డి. తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీ అభ్యర్థులకు నేడు కౌన్సిలింగ్.

**భూపాల్ పల్లి టౌన్, ప్రజా జ్యోతి, అక్టోబర్ 14 :**
జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని డీఎస్సీ 2024 ద్వారా ఎంపిక కాబడి నియామక ఉత్తర్వులు పొందిన అభ్యర్థులందరూ నేడు ఉదయము 10 గంటలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భూపాలపల్లి లో కౌన్సిలింగ్ కు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్ ల తో హాజరు కావలసిందిగా జిల్లా విద్యాశాఖ అధికారి యం. రాజేందర్ తెలియజేశారు. అన్ని క్యాడర్లకు చెందిన అభ్యర్థులందరికీ కౌన్సిలింగ్ 15.10.2024న నిర్వహించ బడునని వారు తెలియజేశారు. అభ్యర్థులు తప్పనిసరిగా హాజరై కౌన్సిలింగ్లో పాల్గొన వలసిందిగా వారు తెలియజేశారు.

# ప్రొఫెసర్ జి.ఎన్ సాయి బాబా మరణం సమాజానికి తీరని లోటు

**-సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు.ప్రవీణ్ కుమార్.**




**భూపాలపల్లి టౌన్, ప్రజా జ్యోతి, అక్టోబర్ 14.**

భూపాలపల్లి పట్టణంలో భగత్ సింగ్ కాలనీలో సిపిఐ పట్టణ కమిటీ కార్యాలయంలో ప్రొఫెసర్ జిఎన్ సాయిబాబా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సిపి పట్టణ కార్యదర్శి సోతుకు.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రొఫెసర్ సాయిబాబా మరణం సమాజానికి తీరని లోటు అని అన్నారు. చెయ్యని తప్పుకు పది సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించి నిర్దోషిగా రిలీజ్ అయ్యారని అన్నారు. రిలీజ్ అయిన ఏడు నెలలకు అనారోగ్యంతో మృతి చెందారని అన్నారు. సాయిబాబా గారు ఆదివాసులు, దళితులు,విద్యార్థులు రైతులు కార్మికుల పక్షన అనేక పోరాటాల నిర్వహించిన వ్యక్తి అని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ లో జన్మించి తెలంగాణ రాష్ట్రం కోసం ఢిల్లీలో విద్యార్థులతో అనేక ఉద్యమాలు నిర్వహించారని తెలిపారు. ప్రొఫెసర్ సాయిబాబా ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ పట్టణ నాయకులు పీక రవి,బుపేల్లి రామచేందేర్, ఇద భాస్కర్, రమేష్ చారి,రాజు, ఓర్స్ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకుడిపై దాడి హేయమైన చర్య

**- కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు మన్నెం ప్రకాష్ రెడ్డి**



**దామెర, అక్టోబర్ 14, (ప్రజా జ్యోతి):**

గీసుగొండ మండలం ధర్మారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు దసరా పండుగను పురస్కరించుకుని ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం జరిగింది. ఫ్లెక్సీలలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఫోటోలు పెట్టకపోవడం చాలా బాధాకరమని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు మన్నెం ప్రకాష్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకుడు పిట్టల అనిల్ ను కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు ఇటీవల తీవ్రంగా దాడి చేశారు. అతనిపై దాడి చాలా బాధాకరమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుడిపాటి శ్రీధర్ రెడ్డి, కూనటి రామకృష్ణ, జన్ను రాంచందర్, జక్కుల రవి,దామెర శంకర్, కిన్నెర కోటి, దుబాసి రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

# వామపక్ష సామాజిక ఐక్యతను బలోపేతం చేద్దాం

**-ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి**

**నర్సంపేట:ప్రజాజ్యోతి :**

వామపక్ష సామాజిక ఉద్యమాలను బలోపేతం చేసే దిశలో కార్యకర్తలు కృషి చేయాలని ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ గాదగోని రవి పిలుపునిచ్చారు. ఈరోజు భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఐక్య) వరంగల్ జిల్లా కమిటీ సమావేశం కామ్రేడ్ కలకోట్ల యాదగిరి అధ్యక్షతన నర్సంపేట లోని ఓంకార్ భవన్ లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గాధగోని రవి మాట్లాడుతూ దేశంలో మతోన్మాద ప్రమాదం పెరిగిందని అట్టడుగు వర్గాల ఉన్న సామాజిక తరగతులకు పెను ప్రమాదం పొంచి ఉన్నదని రాజ్యాంగం కల్పించిన హక్కులను అమలు చేయకుండా పెట్టుబడుదారులకు కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను కట్టబెట్టే విధానాలకు పాల్పడుతున్నారని ఉచిత హామీలతో ప్రజలను మభ్యపెట్టి హక్కుల కోసం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడే ప్రజా ఉద్యమాలను వ్యక్తులను అణిచి వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో రాజ్యాంగ రక్షణ కోసం ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం దోపిడి విధానాలను నిరసిస్తూ సామాజిక అనుచవేతకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు వామపక్ష సామాజిక శక్తులు ఐక్యంగా ముందుకు కదిలి ప్రజా ఉద్యమాలను పెంపొందించే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. క్రమంలో పీడిత పక్షాల ప్రజా గొంతుక ఎంసిపిఐ(యు) వ్యవస్థాపక నేత





అమరజీవి అసెంబ్లీ టైగర్ కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ 16వ వర్ధంతి సందర్భంగా వర్తమాన రాజకీయాలు మార్క్సిజం అంబేద్కర్ ఆలోచన విధానం అంశంపై తమ స్థాయిలో చర్చనీయాంశం చేయాలని గ్రామస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలని అందుకు ప్రారంభ సూచికగా ఈనెల 17న మచ్చాపురం లోని ఓంకార్ 150 ఫీట్ల స్థూపం దగ్గర వర్ధంతి సభ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు గోనె కుమారస్వామి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంద రవి రాష్ట్ర కమిటీ సభ్యులు నాగెల్లి కొమురయ్య కుసుంబ బాబూరావు వంగల రాగసుధ జిల్లా నాయకులు మహమ్మద్ రాజా సాహెబ్ కొత్తకొండ రాజమౌళి కేశెట్టి సదానందం గాజుల వెంకటయ్య అప్పనపురి నర్సయ్య దామ సాంబయ్య లతోపాటు జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# దాడులు చేసిన వారికీ మద్దతు తెలుపటం బాధాకరం

**- మంత్రి సురేఖ తీరును ఖండించిన ఆత్మకూరు మండల కాంగ్రెస్ కమిటీ**

**ఆత్మకూరు అక్టోబర్ 14 (ప్రజా జ్యోతి):**

కాంగ్రెస్ కార్యకర్త పిట్టల అనిల్ పై దాడులు చేసిన వారికి మంత్రి కొండా సురేఖ మద్దతు తెలుపటం బాధాకరం అని కాంగ్రెస్ ఆత్మకూరు మండల పార్టీ అధ్యక్షుడు కమలాపురం రమేష్ అన్నారు. సోమవారం ఆత్మకూరు మండల కేంద్రంలో ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. దసరా ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన బ్యానర్ లో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఫోటో లేదని అడిగిన అనిల్ పై తీవ్ర స్థాయిలో దాడి చేశారు. దాడులు చేసిన వారికి మద్దతు తెలిపిన విషయాన్ని ఆత్మకూరు మండల కమిటీ ఖండిస్తున్నదన్నారు. బాధ్యత గల మంత్రి పదవిలో ఉన్నారు, కార్యకర్తలు తప్పులు చేస్తే చెప్పేది పోయి.. మీరే ఇలా ప్రవర్తించటం కాంగ్రెస్ కార్యకర్తలను బాధపెడుతున్న విషయం అని తెలిపాడు. పరకాల లో కాంగ్రెస్ మీటింగ్ లో కొండా దంపతుల ఫోటోలు లేవు అని మీ వర్గీయులు గొడవలు చేశారు. అప్పుడు లేని తప్పు.. ఇప్పుడు ధర్మారం లో అడిగితే మీకు తప్పు ఎలా అనిపించిందో తెలపాలన్నారు. మీరే ప్రభుత్వంలో ఉండి రేవూరి ప్రకాష్ రెడ్డి ని గౌరవించాలని చెప్పకుండా అధికారంలో ఉన్న అధికారులను మాటలు అనటం ఏంటని కాంగ్రెస్ కార్యకర్తలు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. ఇప్పటికైనా కార్యకర్తలను సమన్వయం చేసి పార్టీని, ప్రభుత్వాన్ని ముందుకు నడపాలని కోరాడు. రేవూరి ప్రకాష్ రెడ్డి కి మద్దతుగా



మండల కాంగ్రెస్ పార్టీ ఉంటుందన్నారు. అనంతరం సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బీరం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. గీసుగొండలో జరిగిన సంఘటలను కొందరు వ్యక్తులు ఉద్దేశ పూర్వకంగానే చేశారన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఫోటో పెట్టక పోవటం తప్పు అని తెలిపాడు. ఇలాంటి సంఘటనలు జరుగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మాజి సర్పంచి పర్వతగిరి రాజు, కాంగ్రెస్ నాయకులు మార్క రజినీకర్ గౌడ్ , పరికిరాల వాసు, చౌళ్లపల్లి మాజి సర్పంచి రవీందర్, ఎన్కటాళ్ళ రవీందర్, తాళ్ల కిరణ్, మొహమ్మద్ బాబు మియా (చిరు),పీఏసీఎస్ మాజి చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్, బోరిగం స్వామి, చిదిరాల శ్రీనివాస్ రెడ్డి, బీరం రాజి రెడ్డి (ఐకే )తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ శాఖలో బదిలీలు

**-మొగుళ్ళపల్లి లైన్మెన్ రఘుకు ఘన సన్మానం**

**-బదిలీలు సహజం..చేసే వృత్తి ధర్మం గొప్పది**

**-మొగుళ్లపల్లి మాజీ సర్పంచ్ మోటే ధర్మన్న**




**మొగుళ్లపల్లి అక్టోబర్ 14 ప్రజాజ్యోతి :**

మొగుళ్లపల్లి మండలంలో వివిధ హోదాల్లో పని చేసే విద్యుత్ శాఖకు చెందిన అధికారులు బదిలీ అయ్యారు. మొగుళ్ళపల్లి మండల విద్యుత్ శాఖ సబ్ ఇంజనీర్ పైసా హరీష్ ములుగు మండలానికి బదిలీ కాగా, మొగుళ్ళపల్లి టౌన్ లైన్మెన్ రఘు టేకుమట్ల మండల కేంద్రానికి బదిలీ అయ్యారు. అలాగే మండలంలోని మొట్లపల్లి లైన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ గణపురం మండలానికి బదిలీ కాగా..మొట్లపల్లి లైన్మెన్ కొమురయ్య చిట్యాల 33 కెవి ఎస్ ఎస్ కు బదిలీ అయ్యారు. కాగా ఆయన స్థానంలో మొట్లపల్లి లైన్మెన్ గా సత్యం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా మొగుళ్లపల్లి టౌన్ లైన్మెన్ రఘుకు విద్యుత్ శాఖ ఏఈ అడ్డగట్ల ప్రమోద్ మండల కేంద్రంలోని ప్రముఖులు శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం మాజీ సర్పంచ్ మోటే ధర్మన్న మాట్లాడారు. ఉద్యోగ జీవితంలో బదిలీలు అనేటివి సహజమని..చేసే వృత్తిలో నిబద్ధత, ధర్మం, ప్రజలకు సేవ చేసే గుణంతోనే పేరు ప్రఖ్యాతులు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐ ఎన్ టి యు సి 327 భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు కట్ల సదయ్య జిల్లా సెక్రటరీనిమ్మల మల్లేశం,ఎస్సీ ఎస్టీ అసోసియేషన్జిల్లా అధ్యక్షుడు రామచందర్ 327 డివిజన్ సెక్రెటరీ జక్కు రాజేందర్, పిఎసిఎస్ చైర్మన్ సంపెల్లి నరసింగరావు, కొడారి ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

# నూజివీడు సీడ్స్ బాండ్ మొక్క జొన్న విత్తనం తో నే రైతులకూ మేలు

**-నూజివీడు సీడ్స్ ఏ ఎస్ ఎమ్ మురళి మోహన్**

**గంగారం అక్టోబర్ 14:( ప్రజా జ్యోతి)**

నూజివీడు సీడ్స్ కంపెనీ ఆధ్వర్యంలో గంగారం మండలంలోని తిరుమలగండి గ్రామం లో బాండ్ ఎన్ ఎమ్ హెచ్ %-%007 మొక్క జొన్న విత్తన రకం పై రైతు క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు గంగారం మండలంలోని తిరుమలగండి గ్రామానికి చెందిన భూపతి తిరుపతి అనే రైతు వేసిన బాండ్ ఎన్ ఎమ్ హెచ్ -007 విత్తన రకం పై రైతు క్షేత్ర ప్రదర్శన సోమవారం నాడు నిర్వహించగ ఈ యొక్క క్షేత్ర ప్రదర్శన కు 130 మంది రైతులు హాజరైయ్యారు. బాండ్ విత్తన రకాన్ని వేసిన రైతులకు ఏ ఎస్ ఎమ్ మురళి మోహన్ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నూజివీడు సీడ్ కంపెనీ ఏ ఎస్ ఎమ్ మురళి మోహన్ మాట్లాడుతూ నూజివీడు సీడ్స్ కంపెనీ ఎన్నో సంవత్సరాలుగా అధిక దిగుబడును ఇచ్చే మేలైన విత్తనాలను రైతులకు అందిస్తుందని అన్నారు. ఈ విత్తనం ఇతర విత్తనాలతో పోలిస్తే వర్షాకాలంలో రైతులకు మేలైనబరువు గల గింజలను అందిస్తుందని, కండె చివరి వరకు గింజలను కలిగి వుంటాయని తెలిపారు. ఒక్క కండెకు 16 నుండి 18 వరుసల గింజలు వుంటాయని ఈ రకం విత్తనం ఎటువంటి కరువు పరిస్థితులలోనైనా నైనా తట్టుకోగలిగే మేలైన విత్తనమని పేర్కొన్నారు. ఈ రకం విత్తనాలు వేసిన రైతులు అధిక దిగుబడులు పొందుతారని







అన్నారు. ఈ కార్యక్రమం లో కొత్తగూడ టీ ఎఫ్ ఏ రాజ్ కూమార్, స్థానిక డీలర్స్ ,తిరుమలగండి గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బుద్ధుని బోధనలు అంబేద్కర్ ఆశయాలనునేటి యువతస్ఫూర్తిగా తీసుకుని కొనసాగించాలి

**-ఏవైఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్లమల్లయ్య.**

**టేకుమట్ల అక్టోబర్14 ప్రజాజ్యోతి న్యూస్ :**

బోధిసత్వగౌతమా బుద్ధునిబోధనలు సూచనలతోపాటు భారతరాజ్యాంగ రచయిత ప్రపంచ మేధావిడాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలను సిద్ధాంతాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకొని కొనసాగించాలని తెలంగాణరాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్లమల్లయ్య అన్నారు. సోమవారం రోజునజయశంకర్ జిల్లాటేకుమట్ల మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్ అద్యక్షతన భారతరత్నబాబా సాహెబ్ అంబేద్కర్ బౌద్ధమతం స్వీకరించినరోజును పురస్కరించుకుని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేశారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ కుల వివక్షత విరగడకు-దేశాభివృద్దికి బౌద్ధమే శరణ్యమన్నారు . బౌద్ధం మతవిశ్వాలను నూరిపోయదు అది మానవాళికి సమత -కరుణ - ప్రజ్ఞలను బోధిస్తుందన్నారు. అణగారిన వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషికోసం చేసిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ హిందువుగాపుట్టి హిందువుగా మరణించవనివేరే మతాన్ని స్వీకరించుటకుముస్లిం, సిక్కు,క్రైస్తవ, మతాలతోపాటుఅన్ని మతాల సిద్దాంతాలు వాటి సారాంశం ఒక్కటే అని చివరికి బుద్దుని బోధనలు సిద్ధాంతాలు లక్ష్యాలునచ్చి బౌద్ధ మతాన్ని 1956 అక్టోబర్ 14న మహారాష్ట్రలోని నాగాపూర్ లో 6లక్షల మందితోస్వీకరించిన గొప్పమేధావి అన్నారు. గ్రామ స్థాయి నుంచి బుద్ధుని బోధనలు అంబేద్కర్ ఆశయాలను సిద్ధాంతాలను ముందుకు



తీసుకెళ్తు దళితులు భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఎదురు కోనకుండా అన్ని రకాల సౌకర్యాలు భారత రాజ్యాంగంలో కల్పించిన మహెూన్నతమైన వ్యక్తన్నారు. భారత దేశం కోసం తన కుటుంబంతో పాటు తన జీవితాన్ని త్యాగం చేసిన త్యాగమూర్తి అని కొనియాడారు. ప్రతి ఒక్కరు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ బాటలో పయనించాలన్నారు .గౌతమా బుద్ధుని బోధనలు సూచనలు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలను సిద్ధాంతాలను లక్ష్యాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకుని కొనసాగించుటకు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి గుర్రపు రాజేందర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వైనాల రవీందర్ దాసారపు సదానందం, నాంపల్లి వీరేశం, శాస్త్రాల కిరణ్ , ఎడ్ల రమేష్, గోనె శ్రీనివాస్, మచ్చ ప్రభాకర్, అంబేద్కర్ వాదులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టు సుభాష్ మృతి తీరని లోటు

**-మండల యూనియన్ నాయకుల సంతాపం**

**భీమదేవరపల్లి అక్టోబర్ 14 ప్రజా జ్యోతి :**

సీనియర్ జర్నలిస్టు, ఆంధ్రజ్యోతి క్రైమ్ రిపోర్టర్ నాయకపు సుభాష్ సోమవారం అకస్మిక గుండె పోటుకు గురై మృతి చెందారు. సుభాష్ అకాల మృతి పట్ల మండల ప్రెస్ క్లబ్ యూనియన్ తీవ్ర సంతాపం తెలిపారు. గడిచిన రెండు దశాబ్దాలుగా జర్నలిస్టుగా సుభాష్ అంకిత భావంతో పని చేశారని కొనియాడారు. జర్నలిస్టు యూనియన్ నాయకునిగా కొనసాగుతూనే పాత్రికేయునిగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. ఆయన మృతి సమాజానికి, జర్నలిస్టు లోకానికి తీరని లోటు అని పేర్కొన్నారు.



# మైనింగ్ జిల్లా ఏడి పై చర్యలుతీసుకోవాలి పొన్నం బిక్షపతి గౌడ్



**టేకుమట్ల అక్టోబర్ 14 ప్రజాజ్యోతి న్యూస్ :**

జయశంకర్ భూపాలపల్లి ఏడి మైనింగ్ పై వరంగల్ డిడిమైనింగ్ సమాచారహక్కు చట్టం2005ప్రకారం అప్పిల్ చేసిన పొన్నం బిక్షపతి గౌడ్. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం కుందనపెల్లి గ్రామంలో గత సంవత్సరం అధిక వర్షాలు కురవడంతో పంటపొలాల్లో ఇసుక మేటలు పెట్టడం జరిగింది. వాటినిబైటికి తీయడం గురించి భూపాలపల్లి ఏడి మైనింగ్ కు ఆపిల్ చేసుకున్నాను కానీ ఏడిమైనింగ్ ప్రోస్టింగ్ గానివేబిల్స్ కానినాకు ఇవ్వలేదు. నేను సమాచారహక్కు చట్టంద్వారా ఇన్ఫర్మేషన్ కోరడం జరిగింది. కానీఏడి మైనింగ్ భూపాలపల్లి నాకుతప్పుడు సమాచారంఇచ్చిమీకే ఇచ్చానని నాకు నోటీసులుఇవ్వడం జరిగింది. ఆనోటీసు ప్రకారం నేను వరంగల్ డిడి మైనింగ్ కు ఈ కాపీలుజతపరుస్తూ ఏడిమైనింగ్ తప్పుడుసమాచారం ఇచ్చినందుకు అతనిపై చట్టరీత్యాచర్యలు తీసుకొనినాకు న్యాయంచేయాలని పొన్నం బిక్షపతి గౌడ్ కోరారు.

# మహాత్మా జ్యోతి బాపూలే విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలి

**-తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్**



**భీమదేవరపల్లి అక్టోబర్ 14 ప్రజా జ్యోతి :**

వరంగల్ జిల్లాలోని దేశాయిపేటలో మహాత్మా జ్యోతి బాపూలే విగ్రహాన్ని ధ్వంసం చేసిన గుర్తుతెలియని దుండగులను వెంటనే అరెస్టు చేసి చట్టరీత్యా శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ అంబేద్కర్ రాష్ట్ర కమిటీ పక్షాన డిమాండ్ చేశారు..మహాత్మా జ్యోతి బాపూలే సావిత్రిబాయి పూలే అణగారిన బడుగు బలహీన వర్గాల కోసం అనునిత్యం శ్రమించి జ్యోతి బాపూలే వారి సతీమణి సావిత్రిబాయి పూలేకు చదువు నేర్పి ఆమె ద్వారా అణగారిన వర్గాల పిల్లల కోసం అనేక పాఠశాలలు ఏర్పాటు చేసి వారికి విద్యాబోధ అందించడం జరిగింది. జ్యోతిబాపూలే సామాజిక సేవా రంగాలలో పనిచేసిన మహెూన్నతమైన వ్యక్తి అటువంటి మహనీయుని విగ్రహాన్ని ధ్వంసం చేయడం చాలా బాధాకరం, హింసలకు అన్యాయలకు గురవుతున్న, ప్రాణాలు కోల్పోతున్న శూద్ర, అతిశూద్రుల కోసం వారి బాగోగుల కోసం పూలే తన జీవితాంతం తపన చెందేవారు .మహనీయుల విగ్రహాలకు చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటికి భద్రత కల్పించే విధంగా ప్రభుత్వాలు తక్షణమే చర్యలు తీసుకొని విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నాము . ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ ,మాడుగుల సంపత్ కుమార్ ,ఎర్ర కార్తీక్, వేముల జగదీష్ ,సిద్ధమల్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ టికెట్ ఛార్జీలు చూసి ప్రయాణికులు షాక్!




**భీమదేవరపల్లి అక్టోబర్ 14 ప్రజా జ్యోతి :**
దసరా పండుగకు సొంతూళ్లకు వెళ్లి తిరిగి నగరబాట పట్టిన ప్రజలకు తెలంగాణ ఆర్టీసీ షాక్ ఇస్తోంది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను పెంచి స్పెషల్ సర్వీసులంటూ అమాంతం ధరలు పెంచేసింది. హనుమకొండ నుండి హైదరాబాద్ కు వెళ్తున్న రాజధాని ఎక్స్ప్రెస్ లో వెళ్తేన్న ఓ ప్రయాణికుడు ధరల పెంపుపై వాపోయాడు. మొన్నటివరకు రాజధాని బస్సులో రూ. 370 ఉండగా రూ. 160 పెంచి రూ.530 చేశారంటూ , డీలక్స్ బస్సులో 260 రూపాయలు ఉన్న టికెట్ అదనంగా 100 రూపాయలు పెంచి 360 రూపాయలు వసూలు చేస్తూ ప్రయాణికులను నిలువు దోపిడీ చేస్తున్నట్లు ప్రయాణికులు వాపోయారు. పండుగకు వచ్చిన ప్రయాణికులు తిరిగి హైదరాబాదుకు వెళ్తుండగా ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల వద్ద నిలువు దోపిడీ చేస్తున్నట్లు ప్రయాణికులు చర్చించుకో సాగారు.

## పెద్దంపేట లో నిఘా నేత్రాల ఏర్పాటు

**-సిఐ చేతుల మీదగా ప్రారంభం**



**భూపాలపల్లి బ్యూరో అక్టోబర్ 14 (ప్రజా జ్యోతి) :**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని పెద్దంపేట గ్రామంలో సోమవారం రోజున మహాదేవపూర్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి సిఐ రామచందర్ రావు తో పాటు ఎస్సై పవన్ కుమార్ చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం సిఐ మాట్లాడుతూ నేర నియంత్రణలో సీసీ కెమెరాలు ఎంతో కీలక పాత్ర వహిస్తాయని అన్నారు.ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని అయన అన్నారు. నిందితులు, అనుమానితులను గుర్తించడంలో, కేసుల ఛేదనలో సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయనీ అన్నారు.శాంతిభద్రతల పర్యవేక్షణకు అందరూ సహకరించాలని, నిఘా నేత్రాలతో ప్రజలకు మరింత రక్షణగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మరియు యువకులు పాల్గొన్నారు.

# కమలాపూర్ దుర్గామాత కమిటీ ఎన్నిక

**హనుమకొండ జిల్లా కమలాపూర్,అక్టోబర్ 14( ప్రజాజ్యోతి):**
కమలాపూర్ మండల కేంద్రంలోని సోమవారం రోజున కొత్త వాడలో నీ దుర్గామాత నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. నూతన అధ్యక్షులుగా కాటం తిరుపతి,కోశాధికారిగా వెలిశెట్టి శ్రీనివాస్,ఉపాధ్యక్షులుగా వడ్డే మహేష్,ప్రధాన కార్యదర్శిగా జక్కు రాజు గౌడ్,సహాయ కార్యదర్శిగా గంధసిరి నరేష్ , కార్యవర్గ సభ్యులుగా పసుల శివ,వెల్డి లక్ష్మీనారాయణ ,కాటం ఆకాష్ ,నాసాని సాంబయ్య, అల్లం రాజు, బత్తుల నాగరాజు, ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కొత్త వాడ దుర్గామాత అధ్యక్షునిగా ఎన్నికైన కాటం తిరుపతి మాట్లాడుతూ ఏడు సంవత్సరాల నుంచి కమలాపూర్ కొత్తవాడలో దుర్గామాత నిలపడం జరుగుతుందని, దుర్గామాత తొమ్మిది రోజులు తొమ్మిది అవతారాలుగా వెలిసి ప్రజలను సుఖశాంతులతో వెలిసేటట్టు ఆ అమ్మవారు చేస్తుందని అందరు కమిటీ సభ్యులు నాతో కమిటీ సభ్యులు సహాయ సహకారాలు అందించి కొత్తవాడ దుర్గ మాత కమిటీ




సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొత్త వాడ దుర్గామాత కమిటీ సభ్యులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 1997..98 సంవత్సర పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**భీమదేవరపల్లి అక్టోబర్ 14 ప్రజా జ్యోతి :**
1997..98 సంవత్సర విద్యార్థులు26 సంవత్సరాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించుకున్నారు. సోమవారం రోజున జిల్లా సెకండరీ పాఠశాల కొత్తకొండ లో 1997..98 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థిని ,విద్యార్థులు, ఉపాధ్యాయులు కలుసుకొని ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. తమ ఉపాధ్యాయులు చెప్పిన విద్యను మళ్లీ 26 సంవత్సరాల తర్వాత ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడం జరిగినది. 26 సంవత్సరాల అపూర్వ కలయిక , పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం,ఘనంగా జరుపుకోవడం జరిగింది. గత 26 సంవత్సరాల చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ , గురువులు మాకు అందించిన విద్యాబుద్ధుల గురించి , మిత్రులందరు చర్చించుకుంటూ ఆనందంగా గడపడం జరిగింది. ఎవరికి ఏ కష్టం వచ్చినా మేమున్నామని మనోధైర్యాన్ని కల్పిస్తున్న మిత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు. అనంతరం విద్యను అందించిన ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించుకోవడం జరిగింది. ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్య ద్వారానే ఏదైనా సాధించవచ్చు. విద్య అని ధనాన్ని ఎవరు దొంగిలించలేరు. మనిషి జీవనశైలి,సమాజంలో చాలామంది విద్యార్థులు విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగులలతో పాటు



ప్రైవేటు కంపెనీలలో జాబ్ చేస్తూ ఉంటారు. సోమవారం విద్యార్థులు కలుసుకుని ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో కొత్తకొండ ఉన్నత పాఠశాల ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు సునీత రాణి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు జి తిరుపతయ్య,, అప్పటి ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# దేవరుప్పులలో ఘరానా మోసం, రూ.40 వేలు అపహరణ



**దేవరుప్పుల అక్టోబర్ 14, (ప్రజాజ్యోతి):-**
దేవరుప్పులలో ఘరానా మోసం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. రాంబోజిగూడెం గ్రామానికి చెందిన పెండ్లి మల్లయ్య అనే వ్యక్తి సింగరాజుపల్లి లోని ఏపీజీవీబీ బ్యాంకు నుండి రూ.40 వేలు విత్ డ్రా చేసుకొని అతని టీవీఎస్ ఎక్సెల్ బైక్ లో పెట్టుకొని సింగరాజు పల్లి నుండి వారి స్వగ్రామానికి వెళ్తుండగా గుర్తు తెలియని ఓ ఇద్దరు వ్యక్తులు సీతారాంపురం గ్రామ సమీపంలో



అతని బండిని ఆపి మీ డబ్బులు కింద పడిపోయాయి చూసుకోండి అని చెప్పారు. అతను బండి దిగి కిందపడి ఉన్న డబ్బులు తీసుకుంటుండగా అతని బైక్ లో ఉన్న రూ.40 వేలు అపహరించి పారిపోయినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఇలాంటి విషయాల్లో జాగ్రత్తగా ఉండాలని ఎస్సై సృజన కుమార్ సూచించారు.

# వర్గీకరణ కమిటీల పేరుతో కాలయాపన చేయద్దు

**-కార్పొరేషన్ లలో మాదిగ జర్నలిస్ట్ లకు ప్రాధాన్యత ఇవ్వాలి.**

**పరకాల, అక్టోబర్ 14, ప్రజా జ్యోతి :**

పరకాల మండల కేంద్రంలో తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం జిల్లా కార్యదర్శి కోడెపాక భాస్కర్ అధ్యక్షతన విలేకరుల సమావేశం ఏర్పాటు చేయగా తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం స్టేట్ కమిటీ మెంబర్ పెండ్యాల సుమన్ పాల్గొని మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించిన విధంగా వెంటనే ఎస్సీ ఎబిసిడి వర్గీకరణ అమలు చేయాలని,కమిటీల పేరుతో కాలయాపన చేస్తే ఊరుకోమన్నారు. రాష్ట్రంలో ఒక మాదిగ మంత్రి కూడా లేకపోవడం మాదిగలపై చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం అవుతున్నదన్నారు.రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ లలో మాదిగ జర్నలిస్ట్ లకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు



మడికొండ పవన్, ఒంటేరు రవి చంద్ర, టౌన్ నాయకులు బొచ్చు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# హనుమకొండ కలెక్టరేట్ లో ప్రజావాణి కార్యక్రమం

**హనుమకొండ జిల్లా ప్రతినిధి,అక్టోబర్ 14, ప్రజా జ్యోతి :**

హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ప్రజలు వివిధ సమస్యలను పరిష్కరించాలని వినతులను అందజేశారు. ప్రజల నుండి వచ్చిన వినతులను జిల్లా అదనపు కలెక్టర్ ఎ.వెంకట్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వై. వి. గణేష్ స్వీకరించారు. ప్రజల నుండి సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వినతులను పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు అదనపు కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 52 వినతులు ప్రజల నుండి అందాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఆర్డీవో



వెంకటేష్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లులు, పాములకు అవాసంగా పరకాల లైబ్రరీ

**-పట్టించుకోని లైబ్రేరియన్**

**పరకాల, అక్టోబర్ 14, ప్రజా జ్యోతి :**

హన్మకొండ జిల్లా పరకాల శాఖ గ్రంథాలయంలో పాములు,పిల్లులకు అవాసంగా మారి అక్కడ వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న పాఠకులకు దిన దిన గండంగా మారింది. ప్రతీ రోజు గ్రంథ పాలకుడు రాజేంద్రప్రసాద్ కు చెప్పిన నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ అభ్యర్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని అభ్యర్థులు ఆవేదన చెందుతున్నారు. గ్రంథ పాలకుడు వచ్చేదే వారానికి రెండు రోజులు గ్రంథాలయాన్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న గ్రంథ పాలకులపై స్థానిక ఎమ్మెల్యే , జిల్లా కలెక్టర్ లైబ్రేరియన్ పై చర్యలు తీసుకోవాలని వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న పాఠకులు కోరుతున్నారు.



# సుభాష్ గౌడ్ మృతికి సంతాపం తెలిపిన ఎమ్మెల్యే నాయిని...

**హనుమకొండ జిల్లా ప్రతినిధి: అక్టోబర్ 14, ప్రజా జ్యోతి :**

హనుమకొండ జిల్లా భీమారానికి చెందిన హనుమకొండ జిల్లా ఆంధ్రజ్యోతి సీనియర్ రిపోర్టర్ నాయకపు సుభాష్ గౌడ్ గుండెపోటుతో మరణించడం పట్ల వరంగల్ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. సుభాష్ పార్థివ దేనికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సుభాష్ గౌడ్ అందించిన సేవలు మరువలేనివి, మంచి మనసున్న మిత్రుడిని కోల్పోవడం చాలా బాధాకరం తన ఆత్మకు శాంతి కలగాలని ఎమ్మెల్యే కోరుకున్నారు.



# కుంట చంద్రమ్మ వర్ధంతి లో పాల్గొన్న మండల పార్టీ నాయకులు.



**రాయపర్తి మండలం అక్టోబర్ 14 ప్రజా జ్యోతి :**

స్థానిక పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే హనుమాండ్ల యశస్విని ఝాన్సీ రెడ్డి ఆవేశాల మేరకు సోమ వారంరాయపర్తి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కుంట రాజు నాన్నమ్మ కుంట చెంద్రమ్మ ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని వారి చిత్ర పటానికి పులమాలలు వేసి, నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించిన మండల పార్టీ అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రేడ్డి,మండల నాయకులు మచ్చ నిల్లయ్య,రేంటలా గోవర్ధన్ రేడ్డి,మునవత్ రవి, కుంట రాంమూర్తి, రంగా రేడ్డి,పీరాని ప్రవీణ్, నల్ల మహేందర్,మరియు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఝాన్సీ రెడ్డి ని కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు.



**రాయపర్తి మండలం అక్టోబర్ 14 ప్రజా జ్యోతి:**

గత కొద్ది రోజుల క్రితం ప్రమాదవశాత్తు గాయపడి చికిత్స అనంతరం బంజారాహిల్స్ లోని ఝాన్సీ రెడ్డి నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న నియోజకవర్గ ఇన్చార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ని, సోమ వారం మర్యాద పూర్వకంగా కలిసి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్న మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు ఊగ మునిత, మండల ముఖ్య నాయకులు ముద్రబోయిన వెంకటేశ్వర్లు, వల్లపు కుమార్, మచ్చ కుమారస్వామి, సోమిరెడ్డి, రామచందర్ రెడ్డి, బద్దం లక్ష్మిరెడ్డి, గజవెల్లి రామశేఖర్, వశపాక ఎల్లయ్య పాల్గొన్నారు.

## డీఎస్ సి 2024 సెలక్షన్ అభ్యర్థులకు కౌన్సిలింగ్

**గంగారం అక్టోబర్ 14 ( ప్రజా జ్యోతి) :**

మహబూబాద్ జిల్లాలో డీఎస్ సి 2024 ద్వారా నియామకం అయినా నూతన ఉపాధ్యాయులకు రేపు అనగా మంగళవారం నాడు రోజున ఉదయం 9:30 నిమిషాలకు పోస్టింగ్ పాఠశాల కేటాయింపులు కోసం కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా విద్యాధికారి వి రాజేశ్వర్ తెలిపారు ఇటీవల ఎల్ బి స్టేడియంలో నియామక పత్రాలు అందుకున్నా ఉపాధ్యాయులు రేపు జిల్లా కేంద్రంలోని ఫాతిమా హై స్కూల్ శనగాపురం రోడ్డు మహబూబాబాద్ జిల్లా నందు నిర్వహించబడును ఇట్టి కౌన్సిలింగ్ కి ఒరిజినల్ నియామక పత్రాలు మరియు మూడు పాస్ ఫోటో సైజ్ ఫొటోస్ తీసుకొని కౌన్సిలింగ్ కు హాజరుకావాలని వీరికి మెరిట్ ఆధారంగా కౌన్సిలింగ్ నిర్వహించి పాఠశాలలను పోస్టింగులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు స్కూల్ అసిస్టెంట్ పండిట్ ఉపాధ్యాయులు 10:30 నిమిషాలకు ఎస్ జి టి లు 11 గంటలకు హాజరుకావాలని తెలిపారు

# పోలీసుల విస్తృత తనిఖీలు



భూపాలపల్లి బ్యూరో అక్టోబర్ 14 (ప్రజా జ్యోతి)

మేడిగడ్డ లక్ష్మి బ్యారేజ్ వద్ద మహాదేవపూర్ సిఐ రామచందర్ రావు, మరియు ఎస్సై పవన్ కుమార్ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు.సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించారు.వాహనాలకు నెంబర్ ప్లేట్లు తప్పనిసరి ఉండాలని సూచించారు.ఈ తనిఖీల్లో సిఐ రామచంద్ర రావు , ఎస్సై పవన్ కుమార్ తో పాటు సివిల్ ఫోర్స్,మరియు టీజీఎస్పి సిబ్బంది పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ని సన్మానించిన ప్రదీప్ రావు



వరంగల్ సిటీ, అక్టోబర్ 14 (ప్రజాజ్యోతి):

కేంద్ర గొప్ప గనుల శాఖ మంత్రి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి కిషన్ రెడ్డిని బిజెపి నాయకులు వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు శాలువాతో ఘనంగా సత్కరించారు. సోమవారం బిజెపి జిల్లా కార్యాలయంలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల సభ్యత్వ సమీక్ష సమావేశంలో కేంద్రమంత్రి గంగవరం కిషన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నె రవీందర్ కిషన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి అనంతరం శాలువాతో సత్కరించారు.

# ఎల్ఐసి ఏజెంట్ల నిరసన

వరంగల్ సిటీ, అక్టోబర్ 14 (ప్రజాజ్యోతి):

అక్టోబర్ 1 నుంచి ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ డెవలప్మెంట్ అథారిటీ (ఐఆర్డిఏఐ) తీసుకున్న నిర్ణయాలకు నిరసనగా వరంగల్ 2 ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయం వద్ద లియాఫీ 1964 యూనియన్ ఆధ్వర్యంలో ఏజెంట్లు సోమవారం నిరసన తెలిపారు. పెంచిన ప్రీమియం ధరలకు, తగ్గించిన కమిషన్ కు, వ్యతిరేకంగా ఎల్ఐసి ఏజెంట్లు లంచ్ అవర్ డెమోనిస్ట్రేషన్ చేయడం జరిగింది. ఇట్టి నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి లియాఫి1964 బ్రాంచ్ అధ్యక్షుడు పబ్బా రాజా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐ ఆర్ డి ఎ ఐ తీసుకున్న నిర్ణయాలు ఏజెంట్ల వ్యవస్థకు ఇబ్బందికరంగా ఉందన్నారు. అందువల్ల ఐ ఆర్ డి ఐ తీసుకున్న నిర్ణయాలను పరిశీలించి పునః సమీక్షించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అశోక్, ముఖ్య నాయకులు రాజిరెడ్డి, రవీందర్ రావు, యాకయ్య, కుమారస్వామి, శ్రీను, తిరుపతి, సురేందర్, కోటేశ్వరరావు, రమేష్, భిక్షపతి, రవిబాబు, శ్రవణ్, వెంకటేశ్వర్లు, లియాఫీ కమిటీ సభ్యులు మరియు సుమారు 100 మంది ఏజెంట్లు పాల్గొన్నారు.

# చెత్త నిర్వహణ సమర్ధవంతంగా చేపట్టండి





**- లాండ్రోమార్ట్ పోతన ట్రాన్ ఫర్ స్టేషన్ ను పరిశీలించిన మేయర్, డిఎంఏ, కమీషనర్**

**- ఐసిసి సెంటర్ పనితీరును అడిగి తెలుసుకున్న డిఎంఏ వీపీ గౌతమ్**

వరంగల్ సిటీ, అక్టోబర్ 14 (ప్రజాజ్యోతి):

సమర్ధవంతంగా చెత్త నిర్వహణ చేపట్టాలని నగర మేయర్ గుండు సుధారాణి, డైరెక్టరేట్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (డిఏంఏ) విపి గౌతమ్ అన్నారు. సోమవారం నగర పరిధిలోని పోతన నగర్ లో గల లాండ్రో మార్ట్ ట్రాన్స్ఫర్ స్టేషన్లను మేయర్ డిఎంఏతో పాటు బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే క్షేత్రస్థాయిలో పర్యటించి నిర్వహణ పనితీరును అధికారులను అడిగి తెలుసుకుని సమర్ధ నిర్వహణకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా లాండ్రో మార్ట్ ను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన మేయర్, డిఎంఎ యంత్రాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ లాండ్రో మార్ట్ యందు రజక సంఘాలతో పాటు రజక సంఘానికి చెందిన స్వయం సహాయక మహిళ సభ్యులకు సుమారు 100 మందికి ఉపాధి కల్పించడానికి చర్యలు చేపట్టడం జరుగుతుందని మేయర్ తెలిపారు. సెకండ్ ట్రాన్సర్ స్టేషన్ పని తీరును పరిశీలించి గృహాల నుండి సేకరించిన చెత్తను కంపాక్టర్ బిన్ లలోకి పంపడంతో పాటు దశల వారిగా కొనసాగే తీరును పరిశీలించి పక్కాగా జరగడానికి పలు సూచనలు చేశారు. స్వచ్ఛ ఆటో ఓనర్ కం డ్రైవర్ లతో చెత్త సేకరణ తరలింపు విధానం గురించి అడిగి తెలుసుకొని ప్రతి రోజూ ఎంత పరిమాణంలో చెత్త సేకరిస్తున్నారు, తరలింపు సమయం లో చెత్త కింద పడకుండా వాహనంపై కవర్ ను ఉంచుతున్నారా, వంటి తదితర అంశాలను డిఎంఏ విపి గౌతమ్ అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ (ఐసిసిసి)ను పరిశీలించిన డిఎంఎ, పనితీరును సంభందిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఐసిసిసి పనితీరును వివరిస్తూ వేరియబుల్ మెసేజ్ డిస్ప్లే, పెలికాన్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, జిఐఎస్ డేటా సెంటర్ ఇన్స్పెక్షన్, కమాండ్ కంట్రోల్ సెంటర్, పబ్లిక్ అడ్రస్ సిస్టం ఎన్విరాన్మెంటల్ సెన్సార్ సిస్టం పనితీరును వివరించారు. డిఎంఏ గౌతమ్ మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ కెమెరాలు పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుండి ఏ సి టి ఎస్, ఎన్ఫోర్స్మెంట్ సిస్టమ్ ను పోలీసులే మానిటరింగ్ చేయాలని ఇందుకోసం అట్టి సిస్టమ్ ను వారికి అప్పగించాలని డిఎంఏ కోరగా వారంలో అందజేస్తామని ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కోసం కేటాయించిన వాహనాలను వేరు చేయాలని వాహనం ట్రాన్స్ఫర్ స్టేషన్ కు గాని డంప్ యార్డ్ వెళ్లిన వాహనాలను బల్దియా అధికారులు ప్రతి రోజూ మానిటరింగ్ చేయాలని, వాహనాలకు సంబంధించిన సమాచారాన్ని కమాండ్ కంట్రోల్ సెంటర్ కు అందజేయాలని, జి డబ్ల్యుఎంసి నుండి మానిటరింగ్ కోసం అధికారిని కేటాయించి మానిటరింగ్ సజావుగా సాగేలా చూడాలని డి ఎం ఏ అన్నారు. ఇట్టి కార్యక్రమంలో ఆర్డిఎంఏ షాహీద్ మసూద్, అదనపు కమీషనర్ రాజేందర్ రెడ్డి, ఎస్ ఈ లు రాజయ్య, ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, హెచ్ఓ రమేష్, ఇన్చార్జి సిపి రవీంద్ర రాడేఖర్, డిప్యూటీ కమిషనర్ లు కృష్ణారెడ్డి, రవీందర్, ప్రసన్న రాణి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఈ ఈ మహేందర్, డిఎంసి రజిత రాణి, రేణుక, టీఎంసి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులను కనుకరించని జాకారం కార్యదర్శి

**- అంతా నా ఇష్టం నాకు ఎవరు ఎదురు చెప్పరు**

ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్(ప్రజా జ్యోతి):

ములుగు జిల్లా ములుగు మండలం జాకారం గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుందని గ్రామ పంచాయతీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న ఓ కార్మికుడికి డ్యూటీ లో ఉండగా ప్రమాదం జరిగి అతని కన్నుకు దెబ్బతాకడంతో ఆ కార్మికున్ని హాస్పిటల్ లో చికిత్స అనంతరం,అతను ఆరోగ్యం బాగాలేక విశ్రాంతి తీసుకుంటే నీకు విశ్రాంతి అవసరం లేదని డ్యూటీలో ఉండాలని అలాగైతేనే జీతం ఇస్తానని లేకుంటే జీతం కట్ చేస్తానని బెదిరించి సిబ్బంది జీతాలను కట్ చేసినట్లు సమాచారం.కార్యదర్శి గ్రామ పంచాయతీ హాజరు రిజిస్టర్ లో ఆబ్సెంట్ వేస్తూ అతనికి రావలసిన సుమారు రెండు నెలల జీతాన్ని కట్ చేసిన ఘనత కూడా ఈ కార్యదర్శి ఉందని కార్మికులు తెలిపారు.అలాగే మిగతా కార్మికులు కూడా పని చేస్తున్న క్రమంలో మీరు పని చేయట్లేదని ఒక్కొక్కరికి ఏ ఒక్కరిని కూడా వదలకుండా ఒక్కొక్కరికి నెల నుండి 45 రోజులు రెండు నెలలు అబ్సెంట్లు వేసి జీతాలు కట్ చేస్తూ పారిశుధ్య కార్మికులను పంచాయతి కార్యదర్శి ఇబ్బంది పెడుతుందని గ్రామ పంచాయతీ కార్మికులు తెలిపారు. అలాగే సర్పంచులు లేని గ్రామాల్లో ప్రత్యేక అధికారులు,పంచాయతీ కార్యదర్శులు గ్రామాన్ని పట్టుకొని ఉండేది పోయి ఎక్కడో వరంగల్ సిటీలలో విలాసవంతమైన ఇళ్లలో ఉంటూ గ్రామ ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడినా పట్టించుకోకుండా వీధిదీపాలు లేకుండా కరెంటు వైర్లు తెగి రోడ్లపై పడి పశువులు గాయాల పాలైనా కూడా పట్టించుకోని కార్యదర్శి ప్రజలు సమస్యలపై అడగగా ఏలాంటి సమాధానం ఇవ్వకుండా దాటవేస్తూ... దీనికి నేను బాధ్యురాలిని కాదని,నాపై ఆఫీసర్ ఉంటాడు..లేదంటే ప్రత్యేక అధికారిని




అడగండి తప్ప నన్ను ఏమి అడగద్దు..నేను నిమిత్త మాతృరాలినని నేను వస్తా..చూస్తా..పోతా తప్పా..నేను ఏమి చేయను అంటూ ప్రజలకు జవాబు చెబుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు.జిల్లా ఉన్నతాధికారులు సమస్యను పట్టించుకోని గ్రామ సమస్యలు పరిష్కరిస్తారని ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు.ఇద్దరు కార్మికులను తొలగింపు గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ..కార్మికులను తొలగించారని సఫాయి కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామ సిబ్బంది లోని సఫాయిలను ఇద్దరిని తొలగించినట్లు సమాచారం తెలవగానే ఏ అధికారంతో తొలగించారని సపాయిలు ఆందోళన వ్యక్తం చేశారు. ఉదయాన్నే లేచి సాయంత్రం వరకు గ్రామాల్లో ఉన్న చెత్తా చెదారాన్ని తొలగిస్తున్న కార్మికులను ఎలాంటి తప్పు లేకుండా తొలగించడం సరికాదని పంచాయతీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి పంచాయతీ కార్యదర్శిపై తగిన చర్యలు తీసుకుని మాకు న్యాయం చేయాలని కోరుతున్నారు.ఈ విషయంపై ములుగు మండల పంచాయతీ అధికారిని వివరణ కోరగా ఇద్దరి గ్రామ పంచాయతీ సిబ్బంది విధులు సరిగా నిర్వర్తించక పోవడం వల్లనే వారిని విధుల నుండి తొలగించామని తెలిపారు.

# బిఆర్ఎస్, కాంగ్రెస్ ల పాలన ఒకే విధంగా ఉంది




**- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి**

**వరంగల్ సిటీ, అక్టోబర్ 14 (ప్రజాజ్యోతి) :**

భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు మహోత్సవం-2024 లో భాగంగా సోమవారం వరంగల్ జిల్లా బిజెపి కార్యాలయం ధర్మారంలో ఉమ్మడి వరంగల్, ఉమ్మడి ఖమ్మం జిల్లాల సభ్యత్వ సమీక్ష సమావేశం వరంగల్ జిల్లా బిజెపి అధ్యక్షులు గంట రవికుమార్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బిజెపి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి, తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షులు జి. కిషన్ రెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా బీజేపీ పార్టీ మరింత బలపడేలా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నాం. రాష్ట్రంలోని గ్రామాల వారీగా పార్టీని మొదటి స్థానంలో తీసుకెళ్లేలా పోలింగ్ బూత్ స్థాయి నుంచి సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించాలని కోరారు. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చే సాధనంగా ఉండేలా కార్యాచరణ రూపొందించుకోవాలని పార్టీ శ్రేణులను కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతి నాయకుడు భాగస్వామ్యమై, అన్ని వర్గాల ప్రజలకు చేరువయ్యేలా ప్రతి ఒక్కరూ మరో వందమందిని సభ్యుడిగా చేర్పించే విధంగా కృషి చేయాలని కోరారు. అనంతరం పత్రికా సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భాజపా సభ్యత్వ నమోదు ఒక ఏడాది ఆలస్యం ప్రారంభమైంది. 15లక్షల సభ్యత్వాలు వచ్చాయి. మరో రెండు నెలల పాటు సభ్యత్వం కొనసాగిస్తాం. భారాస 10 సంవత్సరాలు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించింది. భారాస, కాంగ్రెస్ పార్టీల పాలన ఒకే విధంగా ఉంది. కాంగ్రెస్ పార్టీ పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలేదు కానీ హైదరాబాద్ లో ఇండ్లును కూల్చీవేస్తున్నారు. గత ప్రభుత్వ పథకాలకు కాంగ్రెస్ పార్టీ పేర్లు మార్చింది. ఇచ్చిన ఆరు గ్యారెంటీలో కేవలం ఒక ఉచిత బస్సు హామీ మాత్రం నేరవేర్చారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు వచ్చే పరిస్థితి లేదు. తెలంగాణలో ప్రభుత్వ పాలన అస్తవ్యస్తంగా మారింది. ఇచ్చిన హామీల అమలుకు నిధులు ఏలా సమకురుస్తారో స్పష్టత లేదు. మూసీ సుందరికరణ పేరిట లక్ష కోట్ల నిధులు కేటాయించారు ఏవిధంగా ఖర్చు చేస్తారో ప్రణాళిక లేదు. హర్యానాలో సంవత్సరం పాటు రైతు ఉద్యమం నడిపిన.. ఎన్నికల్లో భాజపాకు హర్యానా ప్రజలు పట్టంకట్టారు.



100 రోజుల భాజపా పాలనలో అనేక చారిత్రత్మక నిర్ణయాలు తీసుకుంది. కాంగ్రెస్ పార్టీకి జమ్మూలో ఒక్క సీట్ దక్కలే. 95శాతం ముస్లిం ఉన్న చోట కుడా భాజపా ఓటింగ్ శాతం పెరిగింది. మోదీ పాలనపై దేశ ప్రజలు విశ్వాసం చూపుతున్నారు. కాంగ్రెస్ పార్టీలో గెలిచి సబితా ఇంద్రారెడ్డి కేసీఆర్ క్యాబినెట్ లో మంత్రిగా పని చేశారు. రాజ్యాంగంకు తుట్లు పొడుస్తు కాంగ్రెస్, భారాస పాలన సాగిస్తోంది. పార్టీ ఫిరాయింపులు.. తిట్టుకోవడంలో భారాస కాంగ్రెస్ పార్టీలు పోటీ పడుతున్నారు. గ్రామస్థాయిలో భాజపాను బలోపేతం చేస్తాం. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు.. 420 హామీల అమలు పై పోరాటం చేస్తాం. దేశంలో కాంగ్రెస్ పార్టీకి ఆదరణ తగ్గింది. మహారాష్ట్ర, జార?ండ్ లో జరిగే ఎన్నికల్లో సత్తా చాటుతాం. రహదారులు.. మౌళిక సదుపాయాల కల్పన పై ప్రత్యేక దృష్టి సాధించాం. తెలంగాణలో 33 జిల్లాలో జాతీయ రహదారులను అనుసంధానం చేశాం. దేశంలో ఎక్కడా లేని విధంగా ట్రిపుల్ ఆర్ రింగ్ రోడ్డును తీసుకువచ్చాం. రాష్ట్ర ప్రభుత్వం 400ఎకరాలను సమకూర్చితే... మామునూర్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ వస్తుంది. రాజకీయాలను భ్రష్టు పట్టించే విధంగా నేతల మాటల దోరణ ఉంది. రాష్ట్రంలోని ఆలయాలను అభివృద్ధి చేస్తాం. హైదరాబాద్ లోని మల్కాజ్ గిరి లో ఆలయాన్ని ముస్లీంలు ధ్వంసం చేయడం బాధాకరం. సింగరేణిని ప్రైవేటికరణ చేయడం లేదు. భారాస హయాంలో గనులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించింది. దేశంలోనే మొదటి సారిగా హైదరాబాద్ నుండి వరంగల్ కు సీసీ రోడ్డు జాతీయ రహదారి నిర్మించాం. ఆయుష్మన్ భారత్ పై నిధులు కొరత ఉంది వాస్తవం. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే వరంగల్ నగరంలో అభివృద్ధి జరిగింది. రాష్ట్రంలో ఇదే విధంగా పాలన సాగిస్తే.... ప్రభుత్వ ఈ ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి ఉండదని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర సభ్యత్వ సహా ప్రముఖ్ మాజీ శాసనసభ్యులు, క్రమశిక్షణ సంఘం చైర్మన్ మార్తనేని ధర్మారావు, గోలి మధుసూదన్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు ఎస్సీ మోర్చ రాష్ట్ర అధ్యక్షులు కొండేటి శ్రీధర్, మాజీ శాసనసభ్యులు విజయరామారావు, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి, మాజీ పార్లమెంట్ సభ్యులు అజ్మీర సీతారాం నాయక్, ఆరూరి రమేష్, ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల అధ్యక్షులు, శాసనసభ్యులుగా పోటీ చేసిన అభ్యర్థులు, సభ్యత్వ ప్రముఖ్ లు , సహ ప్రముఖ్ లు, రాష్ట్ర, జిల్లాల పదాధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# విశ్రాంత ఉద్యోగులను సన్మానించిన పోపా

**- రిటైర్మెంట్ ఉద్యోగస్తుల సేవలు చిరస్మరణీయం**

**- పోపా జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి**

**వరంగల్ సిటీ, అక్టోబర్ 14 (ప్రజాజ్యోతి):**

విశ్రాంత ఉద్యోగుల సేవలు చిరస్మరణీయమని, విధులలో ఉన్నంతకాలం ప్రజా సంక్షేమం కోసం కృషిచేసిన ఉద్యోగస్తుల సేవలను జాతీయ పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి, రాష్ట్ర పోపా అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు గుండు కామేశ్వర్, ప్రధాన కార్యదర్శి పాము శ్రీనివాస్, ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు అన్నారు. అతిథులుగా మాజీ జెడ్పి చైర్మన్ సాంబారి సమ్మారావూ, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కుసుమ సతీష్, వన్నాల వెంకటరమణ, పోపాకన్వీనర్ గోషికొండ సుధాకర్, గుండు ప్రభాకర్ వట్నాల సత్యనారాయణ హాజరయ్యారు.సోమవారం కొత్తవాడలోని పద్మశాలి కమ్యూనిటీ హాల్లో పోపాఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కార్ అవార్డు ప్రధానోత్సవం చేశారు. వారితో పాటు వివిధ రంగాలలో కృషిచేసిన వ్యక్తులను, పైలెట్స్ డాక్టర్లను, ఉన్నత పదవులు అధిరోహించిన వారిని, రిటైర్మెంట్ ఉద్యోగస్తులను, ఫోటోగ్రాఫర్



ఘనంగా సన్మానించారు విశ్రాంత ఎంఈఓ ఆర్ సదానందం,. బిఎస్ఎన్ఎల్ ఏఈ, విశ్రాంత ఉపాధ్యాయులు, జడల శ్రీనివాస్ రావు, జడల చంద్రశేఖర్ బత్తుల సత్యం నమస్తే తెలంగాణ ఫోటోగ్రాఫర్ మెరుగు ప్రతాప్ ను తదితరులను మెమెంటో అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు.

# తమ్మడపల్లిలో దాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**-దాన్యం కొనుగోలుకేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి**

**-సహకార సంఘం జిల్లా అధికారి రాజేందర్ రెడ్డి**



**అక్టోబర్ 14 (ప్రజాజ్యోతి) :**

రైతులు పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకో వాలని జిల్లా సహకార సంఘం అధికారి రాజేందర్ రెడ్డి, అసిస్టెంట్ రిజిస్టర్ వేణుగోపాల్, పిఎసిఎస్ చైర్మన్ పులిగిల్ల పూర్ణచందర్ అన్నారు. సోమవారం బచ్చన్నపేట మండలం తమ్మడపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పిఎసిఎస్ ధ్యానం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మకుండా నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలన్నారు. క్వింటాలుకు ఏ గ్రేడ్ ధాన్యం రూ. 2320, బీ గ్రేడ్ ధాన్యం రూ. 2300, సన్న ధాన్యముకు 2800 రేటును నిర్ణయించిందన్నారు.రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకొని నాణ్యతగా కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని అన్నారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని సక్రమంగా కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఎలాంటి అవకతవకలు జరుగకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా సీఈవో బాలస్వామి,మాజీ సర్పంచ్ మేకల కవిత రాజు, డైరెక్టర్లు సిద్ధులు, ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు దాసారం శ్రీనివాస్ రెడ్డి, బైరగోని దామోదర్ ,స్థానిక రాజయ్య, బెజాడి నాగరాజు, ఉపేందర్ రెడ్డి ,సిద్ధారెడ్డి శ్రీను , రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# సబ్ స్టేషన్ లైన్ మెన్ గా పాషా బాధ్యతలు స్వీకరణ




**మరిపెడ,అక్టోబర్14 (ప్రజా జ్యోతి) :**

మహబూబాబాద్ జిల్లా మరిపెడ సబ్ స్టేషన్ లైన్ మెన్ గా పాషా బాధ్యతలు స్వీకరించారు.తొర్రుర్ సబ్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న పాషా బదిలీ పై మరిపెడ సబ్ స్టేషన్ కు బదిలీ పై వచ్చారు.సోమవారం ఏఈ పావని కి జైనింగ్ ఆర్డర్ కాపీ అందజేశారు.ఆయన వెంట ఐఎన్ టి యూ సి డివిజన్ కార్యదర్శి వీరసోములు,స్వామి,రెడ్డి,రాష్ట్ర నాయకులు సికిందర్,సైదులు, మరిపెడ విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

## వెంచర్ రోడ్డు.. ఉపయోగం ఇలా..

– రైతులకు ఉపయోగకరంగా వెంచర్ సిసి రోడ్డు



**ఆత్మకూరు అక్టోబర్ 14 (ప్రజా జ్యోతి):**
ఆత్మకూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వెంచర్ కు సంబంధించిన సీసీ రోడ్డు రైతులకు ఉపయోగకరంగా మారింది. కొద్ది రోజుల క్రితం మండల కేంద్రంలో నేషనల్ హై వే పై నాన్ లేఔట్ వెంచర్ వెలిసింది. ఈ వెంచర్ చుట్టూ కాంపౌండ్ ఏర్పాటు చేసి, ఏకంగా సిసి రోడ్ వేశారు. కొన్ని ప్లాట్లు అమ్ముడు పోగా ఇంకా కొన్ని ప్లాట్లు మిగిలి ఉన్నాయి. ఈ ప్లాటింగ్ లో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి ఉపయోగంలోకి రాలేదు. అయినా ఈ సిసి రోడ్డు రైతులు పంట ఆర బోసుకోవడానికి ఉపయోగకరంగా మారింది. ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి ఉపయోగపడకుండా ఉన్న సీసీ రోడ్డును రైతులు ఈ విధంగా ఉపయోగించుకుంటున్నారు. వర్షం పడిన సమయంలో సులువుగా పర్దాలు కప్పుతూ ఉపయోగించుకుంటున్నారు.

## కలెక్టర్ ని కలిసిన నరకాసుర వధ ఉత్సవ కమిటీ



**వరంగల్ సిటీ, అక్టోబర్ 14 (ప్రజాజ్యోతి):**
నగరంలోని ఉర్సు గుట్ట కుడా మైదానంలో అక్టోబర్ 30న నిర్వహించే నరకాసుర వధ ఉత్సవాలకు ప్రభుత్వపరంగా అన్ని రకాల సదుపాయాలు ఏర్పాటుచేయాలని జిల్లా కలెక్టర్ సత్య శారద ను ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి కోరారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కమిటీ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. నరకాసుర వధ ఉత్సవాలను తిలకించడానికి దాదాపు 20 వేల మందికి పైగా ప్రజలు హాజరవుతారని ఉర్సుగుట్ట వద్ద గల కుడా ప్రాంగణంలో పెద్ద ఎత్తున విద్యుత్తు, ఆధునిక సౌండ్ సిస్టంలతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించాలని అధ్యక్షులు మరుపల్ల రవి జిల్లా కలెక్టర్ ను కోరారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన కలెక్టర్ ఉత్సవానికి పూర్తిస్థాయిలో అన్ని రకాల ఏర్పాట్లు చేపట్టేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. సంబంధిత అధికారులకు తెలియపరచి ఏర్పాట్లు చేయిస్తానన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి శతపతి శ్యామల రావు, సహాయ కార్యదర్శి ఆవునూరి రామ్మూర్తి, సంయుక్త కార్యదర్శి వనం కుమార్, సభ్యులు దూడ కొమురెల్లి, అన్న కుమారస్వామి, తౌటం నరసింహ, గౌడ్ రామ్ తదితరులు ఉన్నారు.

# పోలీస్ స్టేషన్ కి వచ్చే బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా కృషి చేయాలి

–డోర్నకల్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఐపీఎస్




**డోర్నకల్ అక్టోబర్ 14 ప్రజా జ్యోతి :**
డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌ను సోమవారం జిల్లా ఎస్పీ రాంనాథ్ కేకన్ తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించడంతో పాటు సిబ్బంది పనితీరు, కేసుల పురోగతి వివరాలను సీఐ రాజేష్ ని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మరింత చేరువ అయ్యేలా పోలీస్ విధులు ఉండాలని జిల్లా ఎస్పీ రాంనాథ్ కేకన్ సూచించారు. డోర్నకల్ పోలీస్ స్టేషన్ తనిఖీ చేశారు. ప్రజా సమస్యల పైన వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా బరోసా కల్పించాలని, బాధితులకు ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీస్ స్టేషన్ ని సంప్రదించవచ్చుని అన్నారు. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం నేరాలు తగ్గుముఖం పట్టాయని అసాంఘిక కార్యకలాపాల పై ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పోలీస్ స్టేషన్ లో పెట్రో కార్ మరియు బ్లూ కోల్ట్ సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారని పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు దూరంగా ఉన్నప్పటికీ 10 నిమిషాల్లో చేరుకునే విధంగా పని చేస్తున్నారని తెలిపారు. పోలిస్ స్టేషన్అధికారులు,సిబ్బంది పనితీరు భేషుగ్గా ఉందని అన్నారు. ఈ సందర్భంగా పెండింగ్ లో ఉన్న కేసుల గురించి, మరియు పెండింగ్ ఉన్న కేసులపై రివ్యూ చేయడం జరిగింది. పోలీస్ స్టేషన్ ల పరిధిలోని కేసుల నమోదు, శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించిన వివరాలని అడిగి తెలుసుకున్నారు.అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో 5S అమలు చేసిన తీరును, విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వారి యొక్క డ్యూటీ ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రిసెప్షన్ వర్టికల్ నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుళ్ల ను పిటిషన్ మేనేజ్మెంట్లో ఎంట్రీ చేసిన డాటా ను తనిఖీ చేశారు. రిసెప్షనిస్ట్ గా ప్రతి దరఖాస్తు పై తప్పనిసరిగా పిటిషన్ మేనేజ్మెంట్ లో జనరేట్ చేసి రిసిప్ట్ ఇవ్వాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో 5S విధానాన్ని పాటిస్తూ పరిశుభ్రంగా ఉండేటట్లు అదేవిధంగా ఫైల్స్, క్రమపద్ధతిలో నిర్దేశిత ప్రదేశాల్లో ఉండేటట్లు చూసుకోవాలని సూచించారు.రికార్డ్ రూమ్, రైటర్ రూమ్ తదితర అన్నివిభాగాలు తిరిగి క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సిబ్బంది తో మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ అంతా పరిశు భ్రంగా గా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ఉంటూ విధి నిర్వహణలో క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. పోలీస్ శాఖ నూతన టెక్నాలజీ అధునాతన టెక్నాలజీ ఉపయోగిస్తున్న దాని గురించి అధికారులకు సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. సిబ్బంది కి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని, ఏమైనా ఉంటే తమ దృష్టి కి తీసుకొని రావాలి అని సూచించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్పీ గారు మొక్కలు నాటడం జరిగింది.ఈ కార్యక్రమంలో డిఎస్పీ తిరుపతి రావు, డి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ సత్యనారాయణ,సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు,డోర్నకల్ సీఐ రాజేష్, ఎస్సై వంశీదర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బస్టాండ్ పనులను వెంటనే ప్రారంభించండి

- కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి
- వైస్ చైర్మన్ తో కలిసి వరంగల్ బస్టాండ్, ఖిలా వరంగల్ సందర్శన



**వరంగల్ సిటీ, అక్టోబర్ 14 (ప్రజాజ్యోతి):**
వరంగల్ బస్టాండ్ పనులను వెంటనే ప్రారంభించాలని కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం వైస్ చైర్మన్, బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే తో కలిసి నిర్మిత వరంగల్ బస్టాండ్ ప్రాంతాన్ని, ఫోర్ట్ వరంగల్ లో క్షేత్ర స్థాయిలో సందర్శించి సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కుడా చైర్మన్ మాట్లాడుతూ వెంటనే బస్టాండు పనులు ప్రారంభించాలని రోడ్డు మధ్య భాగంలో ఉన్న రోడ్డు మొత్తం మూసివేసి చుట్టూ ఎన్ క్లోజర్ లను ఏర్పాటు చేసి పనులు కొనసాగించాలని తెలిపారు. ప్రజలు ప్రయాణించడానికి వీలుగా ఇప్పటికే ఐటీ ఆఫీసు ప్రక్కన రోడ్డును ఏర్పాటు చేయడం జరిగిందని, అట్టి రోడ్డును సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఖిలా వరంగల్ ప్రాంతంలో గల పార్కులో గల గుండు చెరువు ప్రాంతాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించి కాటేజీ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని, ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తి అయినందున గుండు చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటుతో పాటు బోట్ క్లబ్ లను ఏర్పాటు చేసి ఈ ప్రాంతం ఆహ్లాదకరంగా ఉండేలా సుందరంగా తీర్చిదిద్దాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కుడా సిపిఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు మరియు తదితరులు పాల్గొన్నారు.